శుక్రవారం
FRIDAY
16-10-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 108

జగిత్యాల JAGITIAL || పేజీలు: (PAGES):12 వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

EVARTHALU దినపత్రిక

వేపకాయల బతుకమ్మ శుభాకాంక్షలు

తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న వేళ సాగునీటి లభ్యత, జలాశయాల నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగంపై రాజకీయ చర్చ తీవ్రతరం అవుతోంది. రాష్ట్రంలో రైతులు నీటి కోసం ఎదురుచూస్తుంటే, అందుబాటులో ఉన్న గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీళ్లొదిలారు..!

కాళేశ్వరం ఉండీ తెలంగాణకు కరువు

ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు లేని భరోసా

కాంగ్రెస్ సర్కారుపై మేధావుల మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ వివాదాలకు పరిమితం చేయకుండా, రైతుల ప్రయోజనాల కోసం ఎంతవరకు ఉపయోగించుకున్నారన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ సాగునీటి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించాలన్న లక్ష్యంతో నిర్మితమైంది. అయితే ప్రాజెక్టులోని బరాజ్లు, పంపుహౌస్‌లకు సంబంధించిన సమస్యలు, మరమ్మతులు, నీటిని ఎత్తిపోసే సామర్థ్యం తరువాయి 2 వ పేజీలో...

నీటి వినియోగంలో రేవంత్ సర్కారు విఫలం

చేతులెత్తేశారు..!

పరిస్థితి చేయి దాటిపోయేలా ఉంది

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో నీరు, విద్యుత్ కొరత తీవ్రతరం అయ్యే అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇప్పటి నుంచే ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని.. ముందు జాగ్రత్త చర్యలు చెప్పారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని హితవు పలికారు. మరీ ముఖ్యంగా యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండి.. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని కీలక విజ్ఞప్తి చేశారు.

యాసంగిలో వరి అస్సలు వేయొద్దు

మనకు నీరు, కరెంటు కష్టాలు తప్పవు

రిజర్వాయర్లన్నీ ఖాళీ అవుతున్నయ్

ఎల్‌నినోపై సీఎం రేవంత్ హెచ్చరికలు

చుక్క చుక్కను ఆదా చేసుకోవాలని హితవు

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం.. విద్యుత్ డిమాండ్ పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఈసారి వచ్చిన ఎల్ నినో ఇటీవలి కాలంలో కనీవినీ ఎరుగని విపత్తు అని..ఈ సమయంలో ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కలిసికట్టుగా కరోనాను ఎదుర్కొన్నట్లే.. ఈ సారి అందరం కలిసి ఎల్ నినోను జయిద్దామని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, నీటి సంక్షోభం, విద్యుత్ సంక్షోభం దరిమిలా.. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రి వర్గంతో తరువాయి 2 వ పేజీలో...

రేవంత్ కమీషన్.. 15%

కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారు.. నచ్చినవాళ్లకే కాంట్రాక్టులు వచ్చేలా కుట్రలు

తేర్వీఎం కన్‌స్ట్రక్షన్స్ ఎండీ సంచలన ఆరోపణలు.. బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి లేఖ

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు టెండర్లు వేయకుండా కాంట్రాక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని ప్రముఖ నిర్మాణ సంస్థ ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ నామా రమేశ్ సంచలన ఆరోపణలు చేశారు. తనకు నచ్చిన కాంట్రాక్టర్లకే టెండర్లు వచ్చేలా చూసుకుని, వారి నుంచి కూడా 15 శాతం కమీషన్ ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జోక్యం చేసుకోవాలంటూ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, సభ్యులకు లేఖ రాశారు. 'ప్రాజెక్టులను కాంట్రాక్టర్లకు కేటాయించడానికి సీఎం రేవంత్ రెడ్డి 15 శాతం కమీషన్ డిమాండ్ చేసినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే అయినప్పటికీ, ఏ ఎమ్మెల్యే కానీ, మంత్రి కానీ ఈ వ్యవహారంపై మాట్లాడటం లేదు. కమీషన్లు ఇచ్చిన కాంట్రాక్టర్లకు తరువాయి 2 వ పేజీలో...

ముడుపుల సర్కారు

సీఎంవోలో 15% కమీషన్ దందా

రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఆరోపణలు

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే తరువాయి 2 వ పేజీలో...

● ఆర్మీ తిరుగుబాటు చేయాలి: ధ్రువ్ రాఠీ



మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోలీసు సిబ్బంది, భారత సైన్యం, బాలీవుడ్ ప్రముఖులు సంఘటితంగా గళమెత్తాలి. పోలీసులు తమ పని పరిస్థితులను ప్రస్తావిస్తూ ఐక్యంగా గొంతెత్తాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపే హక్కు మనకు ఉంది.

- యూట్యూబర్ ధ్రువ్ రాఠీ

● మాకు బంగ్లాదేశ్ స్ఫూర్తి

భారత్‌లో యువత నేతృత్వంలో జరుగుతున్న నిరసనలకు బంగ్లాదేశ్ ఉద్యమమే స్ఫూర్తి. ఈ దేశమంతటా మనం చూస్తున్న జెన్ జీ ఉద్యమం మొదట బంగ్లాదేశ్‌లోనే ప్రారంభమైంది. మాకు దారి చూపినందుకు, ఈ దేశ యువతకు సంఘీభావం తెలిపినందుకు మీకు (బంగ్లాదేశ్) అభినందనలు. భారత్, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య, ఓటు హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు జరుగుతున్నాయి.

- జేఎన్‌యూ స్టూడెంట్ నేహా బోరా

● ప్రభుత్వ మార్పే మా లక్ష్యం

ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం బలహీనపరుస్తూనే ఉంటే ప్రభుత్వ మార్పును సమర్థించాల్సిందే. ప్రభుత్వ మార్పు కోరే ప్రజాస్వామ్య హక్కు ప్రజలకు ఉంది. మేము ఈ దేశంలోని ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మాత్రమే కోరుతున్నాం. ఇలాంటి అనాగరిక చర్యలు కొనసాగితే కచ్చితంగా పాలన మారుతుంది. మేమంతా పాలన మారాలని కోరుకుంటున్నాం. ఇందులో తప్పేముంది?

- న్యాయవాది ప్రశాంత్ భూషణ్

తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 320 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అందులోనూ 117 మండలాల్లో తీవ్రమైన కరువు తాండవిస్తోంది. ఈ మేరకు సీఎం సలహాదారు రామకృష్ణారావు ఎల్‌నినో తీవ్రత, దాని వల్ల కలిగే ప్రభావాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పేర్కొన్నారు.

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,744
వెండి (కిలో):	రూ.2,40,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,884

విశ్వవాణి

అమెజాన్ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా కొలంబియా కీలక నిర్ణయం తీసుకుంది. 2026లో తన అమెజాన్ జీవావరణ ప్రాంతంలో సుమారు 4.83 లక్షల చదరపు కిలోమీటర్లను సహజ వనరుల సంరక్షణ ప్రాంతంగా ప్రకటించింది. ఇది కొలంబియా భూభాగంలో సుమారు 42 శాతం కాగా, స్పెయిన్ దేశ విస్తీర్ణంలో దాదాపు 95 శాతానికి సమానం. ఈ ప్రాంతంలో కొత్త చమురు, సహజ వాయువు అన్వేషణకు, ఉత్పత్తి ఒప్పందాలకు, భారీ స్థాయి గనుల తవ్వకాల అనుమతులకు ఆంక్షలు విధించారు. ఇప్పటికే చట్టబద్ధంగా ఉన్న హక్కులను ఈ నిర్ణయం స్వయంచాలకంగా రద్దు చేయదు. అయితే, భవిష్యత్తులో పారిశ్రామిక కార్యకలాపాల విస్తరణకు గణనీయమైన పరిమితులు ఏర్పడనున్నాయి. ప్రపంచంలోనే అత్యంత జీవవైవిధ్యం కలిగిన పర్యావరణ వ్యవస్థల్లో ఒకటైన అమెజాన్ అడవుల పరిరక్షణకు ఈ చర్య దోహదపడనుంది.

17 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలో

ప్రత్యేక సవరణ

సర్ వివాదం వేళ ఈసీ సంచలన నిర్ణయం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశవ్యాప్తంగా రచ్చ జరుగుతున్న తరుణంలో కేంద్ర ఎన్నికల కమిషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. కొత్త ఓటర్లను చేర్చడం, ఎస్ఐఆర్ ద్వారా తొలగించిన వారిని కవర్ చేయడంపై దృష్టి సారిస్తూ 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక చేర్పుల సవరణకు ఉత్తర్వులు వెలువరించింది. ఈ సవరణ పరిధిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయి. అర్హులైన వారిని గుర్తించేందుకు 2027 జనవరి 1ను గడువు తేదీగా నిర్ణయించారు

న్యూఢిల్లీ: . నవంబర్ 12న ముసాయిదా జాబితా, 2027 జనవరి 4న తుది జాబితాను ప్రచురించ ఓనున్నారు. కాగా యూపీ, పంజాబ్ అసెంబ్లీకి 2027 ఫిబ్రవరి నాటికి ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎస్ఐఆర్‌పై నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ ప్రక్రియలో ఓటర్ల తొలగింపుపై విపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రక్రియలో ఫారమ్ 6తో పాటు దరఖాస్తుదారులు సమర్పించాల్సిన అదనపు డిక్లరేషన్ కూడా వివాదానికి ప్రధాన కారణమైంది. ఎస్ఐఆర్ పరిధిలోని ఇతర ఓటర్ల మాదిరిగానే, దరఖాస్తుదారులు దాదాపు 20 ఏళ్ల క్రితం జరిగిన చివరి ఎస్ఐఆర్ నమోదుతో తమ తల్లిదండ్రుల వివరాలను మ్యాప్ చేయాలని ఈ డిక్లరేషన్ కోరింది. ఇదే అంశంపై తరువాయి 2 వ పేజీలో...

మతం మారితే రిజర్వేషన్ క్యాన్సిల్

సుప్రీం కోర్టు కీలక తీర్పు.. తమిళనాడు ప్రభుత్వ జీవో కొట్టివేత

న్యూఢిల్లీ: హిందూ మతం నుంచి ఇస్లాం మతంలోకి మారిన వారికి 'బ్యాక్‌వర్డ్ క్లాస్ ముస్లిం' కోటా కింద రిజర్వేషన్లు కల్పించాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మతం మారిన తర్వాత కూడా గతంలో ఉన్న కులం ఆధారంగా రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడం కుదరదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ, తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ శ్రీ తరువాయి 2 వ పేజీలో...

పాక్‌లో స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి

పెషావర్: పాకిస్థాన్‌లో గురువారం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాల భవనం పైకప్పు కూలిన ఘటనలో 28 మంది చిన్నారులు, ఒక ఉపాధ్యాయురాలు సహా మొత్తం 29 మంది దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరో 40 మందికి పైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పెషావర్‌లోని దిర్ కాలనీ ప్రాంతంలో ఈ హృదయవిదారక ఘటన చోటుచేసుకున్నట్లు నగర పోలీస్ చీఫ్ మియాన్ సయీద్ వెల్లడించారు. ఈ ప్రమాదానికి సంబంధించి పాఠశాల యజమానిని ఇప్పటికే పోలీసులు తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

16.10.2026

మేషం: శ్రమతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఇంటా బయట పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. బంధువర్గంతో చిన్నపాటి వివాదాలు తప్పవు. వ్యాపారాలలో ఆలోచించి ముందుకు సాగడం మంచిది.

వృషభం: సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మరింత లాభసాటిగా సాగుతాయి. సంతాన వివాహ విషయంలో శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పురోగతి సాధిస్తారు. బంధువుల కలయిక ఉత్సాహాన్నిస్తాయి.

మిథునం: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధికమౌతాయి. చేతిలో డబ్బు నిలవక నూతన ఋణాలు చేస్తారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి.

కర్కాటకం: వ్యాపార విస్తరణకు శ్రీకారం చుడతారు. గృహమున శుభకార్యాల ప్రస్తావన వస్తుంది. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. చేపట్టిన వ్యవహారాలు లాభసాటిగా సాగుతాయి.

సింహం: మీ నిర్ణయాలు కుటుంబ సభ్యులకు నచ్చకపోవచ్చు. సన్నిహితులతో వివాదాలు కొంత మానసికంగా కలచివేస్తాయి. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు పెరుగుతాయి. ఆర్థిక విషయాలు నిరాశ పరుస్తాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి.

కన్య: వ్యాపార, ఉద్యోగాలు మరింత అనుకూలిస్తాయి. సంతాన వివాహయత్నాలు సానుకూలమౌతాయి. ఇంటా బయట నూతన విషయాలు తెలుస్తాయి. చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి.

తుల: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. ఇంటాబయట మీ నిర్ణయాలు అందరు గౌరవిస్తారు. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

వృశ్చికం: భాగస్థులతో ఒప్పందాలు వాయిదా పడుతాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. వ్యాపార ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. సోదరులతో ఆస్తి వివాదాలు కొంత చికాకు పరుస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

ధనస్సు: ఆలయ దర్శనాలు చేసుకుంటారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వృథా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో ఇబ్బందులు తప్పవు. బంధువులతో మాటపట్టింపులుంటాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

మకరం: వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. నూతన వాహన యోగం ఉన్నది. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. దూరపు బంధువుల నుండి ఆసక్తికర సమాచారం అందుతుంది.

కుంభం: ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన పనుల్లో అవాంతరాలు ఉంటాయి. వ్యాపారాలు మందగిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు తప్పవు. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. సోదరులతో కలహ సూచనలున్నవి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

మీనం: ఉద్యోగాలలో ఊహించని స్థానచలన సూచనలున్నవి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగవు. స్థిరాస్తి కొనుగోలులో ఆటంకాలు ఉంటాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. చిన్ననాటి మిత్రులతో కలహ సూచనలున్నవి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

నీళ్లొదిలారు..!

వంటి అంశాలు దాని వినియోగంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించేందుకు ప్రభుత్వం ఎంత వేగంగా చర్యలు తీసుకుందనే అంశంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణలో సాగునీటి అవసరాలు ఒకవైపు, గోదావరి జలాల వినియోగం మరోవైపు ఉన్నప్పుడు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో సమస్యలు ఉన్నాయనే కారణంతో మొత్తం నీటిపారుదల వ్యవస్థను పక్కన పెట్టలేమని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఏ బరాజ్ నుంచి ఎంత నీటిని తీసుకోవచ్చు? ఏ పంపుహౌస్‌లను వినియోగంలోకి తేవచ్చు? మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా ఏ మార్గాల్లో నీటిని మళ్లించవచ్చు? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ అవసరమని పేర్కొంటున్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి. జీవన్‌రెడ్డి సైతం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అక్టోబర్ 2న డిమాండ్ చేశారు. గోదావరి, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రం కావచ్చని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగంపై ప్రభుత్వం సమగ్ర లెక్కలు వెల్లడించాల్సిన అవసరం ఉందనే చర్చకు ప్రాధాన్యం ఏర్పడింది.

కుప్పం వరకు నీళ్లు.. తెలంగాణలో మాత్రం కొరతా?

గోదావరి జలాలు తెలంగాణ అవసరాలకు వినియోగపడకుండా దిగువకు వెళ్లిపోతున్నాయనే విమర్శలు రాజకీయంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం వరకు నీళ్లు చేరుతున్నాయన్న వాదనను ప్రస్తావిస్తున్నవారు, తెలంగాణలోని రైతులకు అవసరమైన సమయంలో నీటిని అందించడంలో ప్రభుత్వ ప్రాధాన్యాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అయితే గోదావరి నుంచి కుప్పానికి నీరు చేరిందనే వాదనను నిర్ధారించడానికి నీటి సరఫరా మార్గాలు, ప్రాజెక్టుల వివరాలు, విడుదలైన నీటి పరిమాణం వంటి ఆధారాలు అవసరం. ఈ వివరాలు లేకుండా రెండు ప్రాంతాలకు చేరిన నీటిని నేరుగా పోల్చడం సాధ్యం కాదు. అయినప్పటికీ తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిని ఎంతవరకు వినియోగించుకున్నారనే ప్రశ్నకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సి ఉంది.

ఎల్‌నినోపై సమీక్షలు.. క్షేత్రస్థాయిలో చర్యలేవి?

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే నెలల్లో వర్షపాతం, సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. అక్టోబర్ 10న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అయితే వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అంచనాలు ఉన్నప్పుడు సమీక్షలతోపాటు క్షేత్రస్థాయిలో అమలయ్యే చర్యలూ అంతే ముఖ్యం. ఎక్కడెక్కడ పంటలకు నీటి కొరత ఉంది? ఏ జలాశయాల్లో ఎంత నీరు అందుబాటులో ఉంది? ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించగలరు? ప్రత్యామ్నాయ పంటలకు రైతులను ఎలా సిద్ధం చేస్తున్నారు? నష్టపోయే రైతులకు ఎలాంటి సహాయం అందించనున్నారు? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం.

రైతులకు సూచనలేనా.. ప్రభుత్వ బాధ్యత లేదా?

యాసంగిలో వరి సాగు చేయవద్దని ముఖ్యమంత్రి రైతులకు సూచించారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని పంటల ప్రణాళికలో మార్పులు సూచించడం ఒక చర్యే అయినప్పటికీ, రైతులు ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు, సాగు ఏర్పాట్లు, ప్రత్యామ్నాయ విత్తనాల లభ్యత, పంట మార్పిడికి అవసరమైన ఆర్థిక సహాయం వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాల్సి ఉంటుంది. వర్షాలు తగ్గినప్పుడు రైతులు తమంతట తామే పరిస్థితులను ఎదుర్కోవాలా? సాగునీటి వనరుల వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, విద్యుత్ సరఫరా, పంట నష్టాల అంచనా, పరిహారం వంటి అంశాల్లో ప్రభుత్వ బాధ్యత ఏమిటి? అన్నది చర్చకు వస్తోంది. రైతులకు పంటలు వేయవద్దని సూచించడంతోపాటు, వారి ఆర్థిక నష్టాన్ని తగ్గించేందుకు అవసరమైన చర్యలను కూడా ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చేతులెత్తేశారు..!

మొదటి పేజీ తరువాయి

సమావేశమయ్యారు. ఎల్ నినోను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలపై వారితో ఆయన సంప్రదించారు. ఆ తర్వాత సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆ వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే..

ప్రపంచాన్నే వణికిస్తున్నది

సహచర మంత్రివర్గ సభ్యులతో ఎల్‌నినో ప్రభావంపై చర్చించాం. 100 దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ప్రకటించారు.ఒక ప్రకృతి విపత్తు ఎల్‌నినో.తీవ్రమైన ఎండలతో పెద్ద ఎత్తున తాగునీటి కొరత ఏర్పడబోతుందని 2026 సంవత్సరం ప్రారంభంలోనే శాస్త్రవేత్తలు ప్రకటించారు. మనల్నందరినీ వణికించిన కొవిడ్ లాంటిదే ఈ ఎల్ నినో సంక్షోభం. 1950 తర్వాత చాలా సందర్భాల్లో ఎల్‌నినో వచ్చింది. కరువుగా దాన్ని పరిగణించాం.కానీ ఈసారి వచ్చిన కరువు పెద్ద విపత్తు.సూపర్ ఎల్‌నినోగా పరిగణిస్తున్నారు.

ఏ ధరకు విద్యుత్ దొరికినా కొనుగోలు చేసి అందిస్తున్నాం

ఎల్ నినో వల్ల సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా ఏర్పడింది. వానాకాలంలోనే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశాం.తెలంగాణలో వరి పండించే రైతులు ఎక్కువగా ఉన్నారు.13 లక్షల ఎకరాల్లో వరి కాకుండా ఇతర పంటలు వేశారు.56 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది. అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలోని 30 లక్షల పంప్‌సెట్లు ఆన్ అయ్యాయి.మార్చిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత అక్టోబర్‌లోనే ఉంది. 20 వేల మూడు మెగావాట్ల విద్యుత్ వినియోగం ఈ రోజు (అక్టోబర్ 15 గురువారం) జరిగింది.ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఈ రెండేళ్లలో ఆరు, ఏడు వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది. విద్యుత్ శాఖ సమర్థవంతంగా పనిచేసి రైతులకు, ఇతర అవసరాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు వస్తాయి.చేతికొచ్చిన పంట ఎండిపోకూడదన్న లక్ష్యంతో మార్కెట్‌లో ఏ ధరకు విద్యుత్ దొరికినా కొనుగోలు చేసి రైతులకు అందిస్తున్నాం. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కూడా విద్యుత్ కొరతతో ఉన్నాయి. రైతులు మనోధైర్యం కోల్పోకుండా ఉండేందుకే మా ప్రభుత్వం కోతలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. గృహ అవసరాలకు తగినట్లుగా విద్యుత్‌ను అందిస్తున్నాం.

తాగునీటికే క్లిష్టమైన పరిస్థితి

సాగునీటి పరిస్థితి తాగునీటి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. కృష్ణా బేసిన్‌లోనీటి నిల్వలు 72 శాతం తక్కువగా ఉన్నాయి.గోదావరి బేసిన్‌లో 40 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. 23 శాతం లోటు వర్షపాతం ఉంది.అన్ని రిజర్వాయర్లు వట్టిపోయే దశలో ఉన్నాయి.24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సి ఉంది. తాగునీటికే ఈ రోజు క్లిష్టమైన పరిస్థితి ఉంది.చలికాలం ఎండాకాలంలా ఉంది. వచ్చే 8 నుంచి 10 నెలల్లో తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.కేంద్రం నుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలనే దానిపై ఈ రోజు సమావేశంలో చర్చించాం.10 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయే పరిస్థితి ఉందని నివేదికలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ పంటను ఎండిపోనివ్వొద్దని అధికారులను ఆదేశించాం. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడాలి. సాగుకు నీటిని పొదుపుగా వినియోగించాలి. 460 టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో ఇప్పుడు కేవలం 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నీటిని పంటలకు ఇస్తే కేవలం నారుమళ్లకే సరిపోతాయి.

నీళ్లను కొనుక్కోలేం

1947లో కరువు వచ్చినప్పుడు దేశమంతా రైతుల ముందు మోకరిల్లింది. దేశంలో ఎప్పుడు సమస్య వచ్చినా రైతులు ముందు నిలబడ్డారు.రైతాంగం ఎప్పుడూ రాజులాగానే వ్యవహరించింది.పేదలైనా రైతులు రాజులా వ్యవహరించారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలి.దేనినైనా కొనుక్కోవచ్చు.. కానీ నీళ్లను కొనుక్కోలేం.అందుబాటులో ఉన్న 200 టీఎంసీల నీళ్లను పొదుపుగా వినియోగించుకోవాలి.

ఈసారి వరి వేయకండి

వచ్చే సీజన్‌లో వరి వేయడాన్ని వాయిదా వేసుకోవాలి.ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టడానికి కార్యాచరణను రూపొందిస్తున్నాం.గత ఏడాది ఈ సమయంలో 25 వేల మంది ఉపాధి హామీ పనులు చేస్తే, ప్రస్తుతం రెండున్నర లక్షల మంది పనుల్లో పాల్గొంటున్నారు.ఉపాధి హామీ పథకంలో చెరువులు, కుంటలను ప్రాధాన్యతగా తీసుకుని మరమ్మతులు చేయాలి. వానాకాలంలో నష్టపోయిన పంటతో పాటు వచ్చే సీజన్‌లో పంట వేయకుండా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలి. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇచ్చే పథకాల ద్వారా రైతులను ఆదుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఉదారంగా సాయం తీసుకునే అంశంపై అధికారులు నివేదికలు తయారు చేయాలి. ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతోంది.

రేవంత్ కమీషన్.. 15%

మొదటి పేజీ తరువాయి

మాత్రమే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి' అని తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.20 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని చెప్పారు. గత మూడేండ్లుగా ఈ బిల్లులను పెండింగ్‌లో పెట్టారని, వాటి విడుదలకు కూడా భారీగా కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఆలస్యం కారణంగా చాలా మంది కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు ఆశలు వదులుకున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణలో కాంట్రాక్టర్లు అనేవారే మిగలరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీఏఐని కోరారు.

సుశీ ఇన్ఫ్రాను కావాలనే తప్పించారు!

రేడియల్ రోడ్డు-2 టెండర్లలో జరిగిన అక్రమాల వివాదం కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి చెందిన 'సుశీ ఇన్ఫ్రా సంస్థ హైకోర్టును ఆశ్రయించడంతో వెలుగులోకి వచ్చింది. టెక్నికల్ ఎవాల్యుయేషన్ సరైన కారణాలు చూపకుండానే తమను అనర్హులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ సుశీ ఇన్ఫ్రా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బుద్వేల్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ నుంచి కొడంగల్ సమీపంలోని నాచారం వద్ద ఉన్న ఎన్‌హెచ్-167చీని అనుసంధానించే 81 కిలోమీటర్ల పొడవైన రేడియల్ రోడ్డు-2 నిర్మాణానికి హెచ్‌జీసీఎల్ టెండర్లు పిలిచింది. మూడు ప్యాకేజీలుగా విభజించిన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 3,295 కోట్లు. టెండర్ల ప్రక్రియలో సుశీ ఇన్ఫ్రాతో పాటు ఎన్‌సీసీ, బీవీఎస్ఆర్, జీకేవీ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. అయితే, టెండర్ల పరిశీలన జరిగిన తీరు చూస్తుంటే సుశీ ఇన్ఫ్రాను కావాలనే లక్ష్యంగా చేసుకుని తప్పించినట్లు కనిపిస్తోందని నామా రమేశ్ ఆరోపించారు.

సీఎంఓ నుంచి బెదిరింపులు?

రేడియల్ రోడ్డు-2 బిడ్డింగ్‌లో పాల్గొనకుండా కాంట్రాక్టర్లను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బెదిరింపులు వచ్చాయని తన లేఖలో పేర్కొన్నారు. 'గత 5-6 ఏండ్లుగా టెండర్లలో కనీసం 10 నుంచి 12 కంపెనీలు పాల్గొంటున్నాయి. కానీ, ఈ టెండర్లలో కేవలం నలుగురు బిడ్డర్లు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన బిడ్డర్లు ముఖ్యమంత్రితో ముందే కుమ్మక్కైన కంపెనీలని తెలుస్తున్నది. బిడ్ దాఖలు చేయాలనుకున్న ఇతర కాంట్రాక్టర్లకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని సమాచారం. కేవలం సుశీ ఇన్ఫ్రా మాత్రమే ధైర్యం చేసి ఇందులో పాల్గొన్నది' అని తెలిపారు.

ఒత్తిడి తెచ్చి డిస్‌క్వాలిఫై చేశారు

బిడ్డింగ్ ప్రక్రియ సమయంలో టెండర్లలో పాల్గొనవద్దని హెచ్‌జీసీఎల్ అధికారులు, ఇతరుల నుంచి తమకు ఫోన్ కాల్స్ వచ్చాయని, మాట వినకుంటే ఎలాంటి సరైన కారణం లేకుండా అనర్హులుగా ప్రకటిస్తామని హెచ్చరించినట్లు సుశీ ఇన్ఫ్రా తెలిపిందని రమేష్ పేర్కొన్నారు. 'ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి మధ్య రాజకీయ విభేదాలు ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. సుశీ ఇన్ఫ్రా రాజగోపాల్ రెడ్డి కుటుంబానికి చెందింది కావడంతో, సీఎం ఒత్తిడి తెచ్చి ఆ కంపెనీని డిస్‌క్వాలిఫై చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకు హెచ్‌జీసీఎల్ అత్యల్ప ధర పలికిన (ఎల్1) బిడ్డర్ ఆర్థిక బిడ్‌ను వెల్లడించలేదు. ప్రస్తుత ఎల్1 బిడ్డర్లు అంచనా వ్యయం కంటే సుమారు 3 నుంచి 15 శాతం ఎక్కువగా కోట్ చేసినట్లు సుశీ ఇన్ఫ్రా పేర్కొంది. ఇది టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లోపాన్ని సూచిస్తున్నది.

ఖజానాకు రూ.600 కోట్ల నష్టం

సుశీ ఇన్ఫ్రా మూడు ప్యాకేజీలకు బిడ్లను సమర్పించిందని, ప్రస్తుతం ఉన్న ఎల్1 బిడ్డర్ల ధరల కంటే తమ ధరలు చాలా తక్కువగా ఉన్నాయని ఆ కంపెనీ పేర్కొందని రమేశ్ వెల్లడించారు. టెండర్ విలువతో పోలిస్తే మొత్తం వ్యత్యాసం దాదాపు రూ.600 కోట్లు ఉంటుందని, సుశీ ఇన్ఫ్రాకు కాంట్రాక్ట్ ఇచ్చి ఉంటే తెలంగాణ ప్రజల సొమ్ము, రాష్ట్ర అభివృద్ధికి రూ.600 కోట్లు ఆదా అయ్యేవని ఆరోపించారు.

17 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణ

మొదటి పేజీ తరువాయి

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి, కాక్రోచ్ జనతా పార్టీలు నిరసనలు తెలుపుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తొలగించాలని డిమాండ్ చేస్తున్నాయి. అక్టోబర్ 15న ఈసీ జారీచేసిన ఉత్తర్వుల్లో "విస్మరించిన/ యువ/ తొలిసారి అర్హత సాధించిన ఓటర్లను నమోదు చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని" సెప్టెంబర్ 29న రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఇచ్చిన సూచనలను ఈసీ ప్రస్తావించింది. అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, మణిపూర్, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌తో పాటు అండమాన్ అండ్ నికోబార్ దీవులు కేంద్రపాలిత ప్రాంతం ఉంది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చడానికి ఫారమ్ 6 లో దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఇందులో వివాదాస్పద అదనపు ఎస్ఐఆర్ డిక్లరేషన్ ప్రస్తావన లేదు. అక్టోబర్ 7న ఈసీ ఇచ్చిన వివరణలో సదరు డిక్లరేషన్ అనేది ఎస్ఐఆర్ జరుగుతున్న రాష్ట్రాలు/యూటీలలో మాత్రమే ఉపయోగించే అదనపు పత్రమని ష్టం చేసింది. ఎస్ఐఆర్ లేని సమయంలో 'ఓటర్ల నమోదు నిబంధనలు, 1960' కింద నిర్దేశించిన సాధారణ ఫారమ్‌లే వర్తిస్తాయని పేర్కొంది. ఈ అదనపు డిక్లరేషన్ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉన్న పలు వివాదాస్పద అంశాలలో ఒకటిగా ఉంది. అన్యాయంగా ఓట్ల తొలగింపు జరగకుండా ఈ ఉత్తర్వుల్లో పలు చర్యలను నిర్దేశించారు. 'మొత్తం ఓటర్లలో 2 శాతానికి పైగా తొలగింపులు ఉన్న చోట' ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (జ=ూం) స్వయంగా వాటిని సరిచూసుకోవాలి. అలాగే ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ కేసుల్లో అభ్యంతరం తెలిపినప్పుడూ ఇది వర్తిస్తుంది. గంపగుత్తగా దరఖాస్తులను అడ్డుకోవడానికి ఒక వ్యక్తి దాఖలు చేసే ఫారమ్ 7 దరఖాస్తులపై పరిమితి విధిస్తూ అక్టోబర్ 9న జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈసీ ప్రస్తావించింది.

మతం మారితే రిజర్వేషన్ క్యాన్సిల్

మొదటి పేజీ తరువాయి

చంద్రశేఖర్‌లతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఈ కేసును విచారించింది. "హిందూ సామాజిక వ్యవస్థ నుంచి మరో మతంలోకి మారిన వ్యక్తి.. తాను మతం మారకముందు ఎదుర్కొన్న సామాజిక వెనుకబాటుతనాన్ని చూపించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) కింద రిజర్వేషన్ ప్రయోజనాలు కోరలేరు" అని బెంచ్ స్పష్టం చేసింది. అంతేకాకుండా, 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాల) ఉత్తర్వుల ప్రకారం.. ఎస్సీ హోదా కేవలం హిందూ, బౌద్ధ, సిక్కు మతాలను ఆచరించే వారికి మాత్రమే పరిమితమని కోర్టు గుర్తుచేసింది. ఒకవేళ మతం మారిన వ్యక్తి తిరిగి హిందూ మతంలోకి వచ్చినా సరే, గతంలో ఉన్న కులపు వెనుకబాటు హోదా ఆటోమేటిక్‌గా తిరిగి రాదని కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడులోని బీసీ, ఎంబీసీ, డీఎన్‌సీ, ఎస్సీ వర్గాలకు చెందిన హిందువులు.. ఇస్లాం మతం స్వీకరిస్తే, వారికి 'బీసీ ముస్లిం' కేటగిరీ కింద కమ్యూనిటీ సర్టిఫికేట్ ఇవ్వాలని 2024 మార్చిలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. దీనిని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేయడంతో, జూలై 6న తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మతం మారినంత మాత్రాన ఒక వ్యక్తి ఎదుర్కొంటున్న సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం రాత్రికి రాత్రే మాయమైపోదని ప్రభుత్వం వాదించింది. తమిళనాడు బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్ సిఫార్సుల మేరకే ఈ పాలసీని తెచ్చామని, కేవలం ఇస్లాం స్వీకరించారన్న కారణంతో వారికి అప్పటికే అందుతున్న రిజర్వేషన్ ప్రయోజనాలు దూరం కాకూడదన్నదే తమ ఉద్దేశమని కోర్టుకు తెలిపింది. అంతకుముందు ఈ కేసును విచారించిన మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, జస్టిస్ పి.బి. బాలాజీల బెంచ్ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ బలమైన కారణాలను చూపింది. తమిళనాడు ప్రభుత్వం గుర్తించిన ఏడు బీసీ ముస్లిం వర్గాలు (అన్సార్, దక్కనీ ముస్లిం, దూదేకుల, లబ్బై - రౌథర్, మరక్కాయర్‌లతో కలిపి, మాపిల్ల, షేక్, సయ్యద్) అనేవి పుట్టుకతో ఏర్పడిన సామాజిక వర్గాలు. కేవలం ఇస్లాం మతం స్వీకరించినంత మాత్రాన ఒక వ్యక్తి ఆటోమేటిక్‌గా ఈ ఏడు వర్గాల్లో ఒకరిగా మారిపోరు. ఇస్లాం మతం సమానత్వాన్ని బోధిస్తుందని, అక్కడ కుల వ్యవస్థ ఉండదని.. కాబట్టి మత మార్పిడి ద్వారా కుల హోదాను పొందలేరని హైకోర్టు స్పష్టం చేసింది.

పాక్‌లో స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

అరెస్ట్ చేశారు. సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసే చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో ఆరుగురు బాలికల సహా 28 మంది విద్యార్థులు, ఒక మహిళా ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారని అధికారులు పేర్కొన్నారు.

పాక్‌లో స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కట

24 లక్షల ఎకరాల
అటవీ భూమి ఏమైంది?

ప్రభుత్వానికి బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి ప్రశ్న

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): తెలంగాణలో దాదాపు 24 లక్షల ఎకరాల అటవీ భూమి లెక్కల్లో వ్యత్యాసం కనిపిస్తోందని, ఆ భూమి ఏమైందో ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రముఖ నాయకులే ఈ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. నేడు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూముల అక్రమాలకు సంబంధించిన గణాంకాలను ఆయన వివరించారు. అధికారిక రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేవలం 42.53 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ భారీ వ్యత్యాసంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం అసైన్డ్ భూముల విక్రయానికి సిద్ధమవుతోందని, ఇది పేద ప్రజలకు తీరని అన్యాయం చేయడమేనని ఆయన విమర్శించారు. గతంలోని ధరణి పోర్టల్ నుంచి నేటి భూభారతి వరకు కేవలం పేర్లు మాత్రమే మారాయని, అక్రమాలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గతంలో న్యాయస్థానం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిన సెక్షన్ 22ఏను, ప్రభుత్వం కొన్ని సవరణలతో నేటికీ కొనసాగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ఆయన ప్రశ్నించారు. ఈ ఆరోపణలతో తెలంగాణలో భూ రికార్డులు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై రాజకీయ చర్చ మరింత ఊపందుకుంది.

8 వేల లంచం..
పట్టుబడ్డ తహసీల్దార్

వేములవాడ రూరల్, అక్టోబర్ 15 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం దాడులు చేశారు. తహసీల్దార్ కమ్ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎం. అబూబకర్, భూ భారతి ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి సంకసాల అనిల్ కుమార్ రూ.8,000 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడి అత్తకు చెందిన వ్యవసాయ భూమిని ఆయన తండ్రి పేరుపై గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు సహకరించే విషయంలో లంచం డిమాండ్ చేసి, నగదును తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

బెజవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల స్వర్ణ కిరీటం

విజయవాడ, అక్టోబర్ 15 (ఈవార్తలు): విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

విద్యుత్ శాఖ ఉన్నతాధికారి సస్పెన్షన్

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు.



ఫిబ్రవరి నాటికి
ఎల్‌నినో తీవ్ర స్థాయికి

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సీఎస్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా రూపొందించిన ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే 15 రోజుల నీటి లభ్యతను అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు పంటలపై చూపే ప్రభావాన్ని వ్యవసాయ, విద్యుత్, సాగునీటి శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు, స్థానిక ప్రజలను కలిసి వారి అవసరాలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికలకు కూటమి సీట్ల పంపకం ఖరారు

11 టీడీపీకి, 4 జనసేనకు, 2 బీజేపీకి కేటాయింపు

విజయవాడ, అక్టోబర్ 15 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి రాబోయే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 2026లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకం ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు గాను ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో స్పష్టతనిస్తూ కూటమి నాయకత్వం తుది నిర్ణయం తీసుకుంది. ఈ పంపకాల్లో, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే తెలుగుదేశం పార్టీకి సింహభాగం దక్కింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల విషయానికి వస్తే, టీడీపీ 11 స్థానాల్లో పోటీ చేయనుంది. జనసేన పార్టీకి 4, బీజేపీకి 2 కార్పొరేషన్లను కేటాయించారు. గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి కీలక నగరాల భవిష్యత్తును ఈ పంపకం నిర్దేశించనుంది. విశాఖ, గుంటూరు, తిరుపతి, మచిలీపట్నం వంటి ప్రధాన కార్పొరేషన్లను టీడీపీ తన వద్ద ఉంచుకోగా, విజయవాడ, కాకినాడ, శ్రీకాకుళం, ఏలూరు కార్పొరేషన్లలో జనసేన అభ్యర్థులు బరిలోకి దిగనున్నారు. ఇక, రాజమహేంద్రవరం, అనంతపురం కార్పొరేషన్లను బీజేపీకి కేటాయించారు.

మున్సిపల్ కార్పొరేషన్ల కేటాయింపు (17)

1. శ్రీకాకుళం – జేఎస్పీ
2. విజయనగరం – టీడీపీ
3. గ్రేటర్ విశాఖపట్నం – టీడీపీ
4. కాకినాడ – జేఎస్పీ
5. రాజమండ్రి – బీజేపీ
6. ఏలూరు – జేఎస్పీ
7. మచిలీపట్నం – టీడీపీ
8. విజయవాడ – జేఎస్పీ
9. మంగళగిరి-తాడేపల్లి – టీడీపీ
10. గుంటూరు –టీడీపీ
11. ఒంగోలు – టీడీపీ
12. నెల్లూరు – టీడీపీ
13. కడప – టీడీపీ
14. కర్నూలు – టీడీపీ
15. అనంతపురం – బీజేపీ
16. తిరుపతి – టీడీపీ
17. చిత్తూరు – టీడీపీ

ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏఈ

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని మాదన్నపేట సెక్షన్ విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న పందాల సంధ్యారాకేష్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. పాత మీటర్ల స్థానంలో ఆరు కొత్త విద్యుత్ మీటర్లు ఇవ్వాలని కోరగా అందుకు లంచం డిమాండ్ చేయడంతో ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో గురువారం ఏఈ రూ.1.20 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి నందుకు గాను అతడిపై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం

రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

నారాయణపేటలో పెట్రోల్ పోసి భర్త హత్య

వివాహేతర సంబంధం నేపథ్యంలో భార్య ఘాతుకం

నారాయణపేట, అక్టోబర్ 15 (ఈవార్తలు): వివాహేతర సంబంధం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడన్న ఆగ్రహంతో రగిలిపోయిన భార్య, పెట్రోల్ పోసి నిప్పంటించి అతడిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘోరం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటుచేసుకుంది. మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాములమ్మ భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, రాములమ్మ ఈ ఘాతుకానికి పాల్పడింది. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను భర్తపై పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో హాహాకారాలు చేసిన బాలస్వామిని గమనించిన స్థానికులు, చికిత్స నిమిత్తం తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. నత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి: జీవన్ రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, రాష్ట్రపతి పాలన విధించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల తెలంగాణ భవన్‌లో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో సాగునీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని జీవన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగినా రైతులకు అవసరమైన విద్యుత్ అందించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 20,191 మెగావాట్లకు పెరిగిందని, యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధ్య విభేదాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. గోదావరి జలాలు వృథాగా పోతున్నాయని, పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరద కాలువ, కాకతీయ కాలువలకు మరో 15 రోజులపాటు నీటిని విడుదల చేయడంతోపాటు రైతులకు 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయిల్నేని వెంకటేశ్వరరావు, వొల్లం మల్లేశం, దేవేందర్ నాయక్, కల్లేపల్లి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట: ఆది



చందుర్తి, అక్టోబర్ 15 (ఈవార్తలు): రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గసికంటి ప్రభాకర్, నూతన కార్యవర్గ సభ్యుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, పంటలకు గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుల సమస్యల పరిష్కారం కోసం పాదయాత్రలు చేసి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లానని, ఇప్పుడు అధికారంలో ఉండటంతో వాటిని పరిష్కరించే అవకాశం లభించిందని చెప్పారు. ఎమ్మెల్యే పదవిని హోదాగా కాకుండా ప్రజాసేవ బాధ్యతగా భావిస్తున్నానన్నారు. 1995లో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, జెడ్పీటీసీ సభ్యుడిగా సహా వివిధ ప్రజాప్రతినిధి బాధ్యతల్లో పనిచేస్తూ ప్రజలకు చేరువయ్యానని గుర్తుచేశారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం సహకార సంఘం అధ్యక్షుడు గసికంటి ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా కృషి చేస్తానని, పంటల కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యత తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో బీజేపీ
బతుకమ్మ సంబరాలు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 15 (ఈవార్తలు): బీజేపీ ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నగర నాయకురాలు గడ్డం సుచరిత ఆధ్వర్యంలో బోయిగూడ ఉప్పలమ్మ దేవాలయం వద్ద ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కవితా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కవితా రెడ్డిని సుచరిత సన్మానించారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జీ. భరత్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వై. సురేష్ కుమార్, రాష్ట్ర నాయకులు ఎస్. రాజు, శ్రీనివాస్, నగర నాయకులు వై. శ్రీనివాస్ ముదిరాజ్, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు మహేష్ రామంచ, ప్రధాన కార్యదర్శులు కిరణ్, పరమేష్, మహిళా నాయకులు విద్యా మోహన్, కె. అండాలు, హిమబిందు, రాజ్యలక్ష్మి, మమత పాల్గొన్నారు.

వేములవాడలో వైభవంగా శరన్నవరాత్రులు

వేములవాడ అర్బన్, అక్టోబర్ 15 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో 11 టైగర్స్ యూత్ ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదో రోజు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహంతో కష్టాలు తొలగి, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ సందర్భంగా 11 టైగర్స్ యూత్ సభ్యులు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

72 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జగిత్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే డా. సంజయ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 72 మంది లబ్ధిదారులకు రూ.72,08,352 విలువైన చెక్కులను అందజేశారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన లబ్ధిదారులకు వీటి ద్వారా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

21 నుంచి పోలీస్ అమరుల సంస్మరణ కార్యక్రమాలు

జగిత్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. అక్టోబర్ 21న పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా స్మృతి పరేడ్ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పిస్తామని చెప్పారు. విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాలపై అవగాహన కల్పించడంతోపాటు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. లఘుచిత్రాలు, ఛాయాచిత్రాల పోటీలు కూడా ఉంటాయని, వాటికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను అక్టోబర్ 23లోపు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని ఎస్పీ సూచించారు. వ్యాసాలను అక్టోబర్ 28లోపు సమర్పించాలన్నారు. రక్తదాన శిబిరం, సైకిల్ ర్యాలీ, అమరవీరుల కుటుంబాలకు నివాళులు, పోలీస్ కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



నేడు నూకపల్లిలో విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ

జగిత్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): నూకపల్లి పట్టణ గృహ నిర్మాణ కాలనీలో నూతన విద్యుత్ ఉపకేంద్రానికి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భూమిపూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో కలిసి భూమిపూజ స్థలంపై చర్చించారు. కాలనీలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కోరగా కొత్త ఉపకేంద్రం మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం కాలనీలో 3,687 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, భవిష్యత్తులో ఈ సంఖ్య 5,600కు పైగా చేరే అవకాశం ఉందని తెలిపారు. కొత్త ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే నాణ్యమైన విద్యుత్ సరఫరాకు వీలవుతుందని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రసూనాంబ, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విమర్శలు కాదు.. అభివృద్ధిపై చర్చకు రండి: నందయ్య

జగిత్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): జగిత్యాల అభివృద్ధిపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డితో ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మూతపడిన 141 పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం పునఃప్రారంభించిందని, మెడికల్ కళాశాలకు ఎమ్మెల్యే చొరవతో రూ.55 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రోళ్లవాగు ప్రాజెక్టు కోసం 800 ఎకరాలకు పైగా భూమిని కొనుగోలు చేశామని, మరో 48 ఎకరాలు సేకరించాల్సి ఉందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని జీవన్‌రెడ్డికి సూచించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత కూడా ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం సరికాదన్నారు. వ్యక్తిగత విమర్శలకు బదులుగా అభివృద్ధి అంశాలపై చర్చకు రావాలని నందయ్య పిలుపునిచ్చారు.

బాధిత రిపోర్టర్లకు
న్యాయం జరిగే వరకు పోరాటం: జింక శ్రీధర్

కరీంనగర్, అక్టోబర్ 15 (ఈవార్తలు): గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు రిపోర్టర్లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ డిమాండ్ చేశారు. బాధిత రిపోర్టర్లకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన పోత్తూరు శేఖర్ ప్రస్తుతం కరీంనగర్‌లో నివసిస్తూ 'ఏక్ దమ్ న్యూస్' పత్రికను నిర్వహిస్తున్నారు. గంభీరావుపేట మండలానికి చెందిన ఇద్దరు రైతుల వివాదం నేపథ్యంలో ఎస్సై శ్రీకాంత్, శేఖర్‌తోపాటు సంపత్ అనే మరో రిపోర్టర్‌ను కరీంనగర్ నుంచి గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు సమాచారం. అక్కడ తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితులు ఆరోపిస్తున్నారు. మరునటి రోజు వారిని కోర్టులో హాజరుపరచగా, వారి శరీరాలపై గాయాలను గమనించిన న్యాయమూర్తి వాంగ్మూలాలను నమోదు చేసుకుని రిమాండ్‌ను తిరస్కరించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపించినట్లు తెలిసింది. ప్రస్తుతం బాధితులు కరీంనగర్ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే పాత్రికేయులపై ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళనకరమని జింక శ్రీధర్ అన్నారు. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, అవి నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

గడువులోగా పుష్కరాల పనులు
పూర్తి చేయాలి: అడ్లూరి

జగిత్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): 2027లో జరగనున్న గోదావరి మహా పుష్కరాల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నవంబర్ 1 నుంచి 2027 మే 31లోగా పనులన్నీ పూర్తయ్యేలా నెలవారీ లక్ష్యాలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనులు చేపట్టాలని అన్నారు. గురువారం జగిత్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ నోటిఫికేషన్లను సోమవారం నుంచే జారీ చేసి, పరిహారం చెల్లింపులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్మపురి మహాలక్ష్మి ఘాట్, రహదారుల విస్తరణ, ఆలయాల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పుష్కరాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.226.41 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. ఘాట్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. గోదావరిలో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్. దినేష్, అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగులను
వేములవాడకు తిరిగి బదిలీ చేయాలి

ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించాలి: వికాస్ రావు

వేములవాడ అర్బన్, అక్టోబర్ 15 (ఈవార్తలు): వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నుంచి కొండగట్టు, బాసర, కొమురవెల్లి తదితర ఆలయాలకు బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి వేములవాడకు బదిలీ చేసే అంశాన్ని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ రావు కోరారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన వీడియో సందేశంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ఆలయాలకు వెళ్లిన ఉద్యోగులు ఇప్పటికే అక్కడ రెండేళ్లకు పైగా విధులు నిర్వహించారని తెలిపారు. కుటుంబ సమస్యలు, పిల్లల విద్య, అనారోగ్య ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఉద్యోగుల పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వేములవాడ ఆలయంలో గతంలో పనిచేసిన ఉద్యోగులకు దేవస్థాన పరిపాలన, భక్తులకు అందించే సేవలు, ఆలయ కార్యకలాపాలపై పూర్తి అవగాహన ఉందని వికాస్ రావు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన సిబ్బంది తిరిగి విధుల్లో చేరితే ఆలయ నిర్వహణ మరింత సమర్థంగా సాగడంతోపాటు భక్తులకు మెరుగైన సేవలు అందించవచ్చని అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల సమస్యలను సానుభూతితో పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాధే శ్యామ్, కాంచి శివకు బీజేపీలో కీలక బాధ్యతలు

కూకట్‌పల్లి, అక్టోబర్ 15 (ఈవార్తలు): బీజేపీ ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడిగా రాధే శ్యామ్, కూకట్‌పల్లి అసెంబ్లీ ఓబీసీ మోర్చా కో-కన్వీనర్‌గా కాంచి శివ బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు వారికి అభినందనలు తెలిపారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శేఖర్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ సమక్షంలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు అంకితభావంతో కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని నాయకులు సూచించారు.

బతుకమ్మ పుట్టినచోట ఆడటం అదృష్టం: కౌన్సిలర్ మమత అజయ్

వేములవాడ అర్బన్, అక్టోబర్ 15 (ఈవార్తలు): వేములవాడ ఆడపడుచులకు, మహిళా సోదరీమణులకు 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత-అజయ్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పుట్టినది, మహిళలు తొలిసారిగా ఆడినది వేములవాడలోనే అని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. అటువంటి ప్రాంతంలో జన్మించడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. వేములవాడలో ఏడో రోజునే సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఇక్కడి మహిళల అదృష్టమని పేర్కొన్నారు. పుట్టినింటితోపాటు మెట్టినింటిలోనూ బతుకమ్మ ఆడుకునే అవకాశం వేములవాడ ఆడపడుచులకు ప్రత్యేకమని తెలిపారు. మహిళలంతా ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో వేములవాడ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి: ఇమ్రాన్

జగిత్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ ఇద్దరు రిపోర్టర్లు శేఖర్, సంపత్‌లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలను గురువారం ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పోలీసుల అధికార దుర్వినియోగం, లంచాల వసూళ్లపై వార్తలు రాసినందుకే రిపోర్టర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దారుణమని వారు పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషించే జర్నలిస్టులపై ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమన్నారు. ఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడం మాత్రమే సరిపోదని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించే చట్టాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

సీఈసీకి కేంద్రం రక్షణ

జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారు.. బీజేపీది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదవం

సీజేపీ నేత అభిజిత్ దీప్కే విమర్శలు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ పనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం ఆరోపించారు. ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు.

యూపీలో 19 లక్షల దొంగ ఓటర్లు

ఈసీ, సర్‌పై అఖిలేష్ సంచలన ఆరోపణలు



లక్నో: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ), బీజేపీపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈసీఐ చేపట్టిన సర్ ప్రక్రియ ద్వారా 19.2 లక్షల దొంగ ఓటర్లను జాబితాలో చేర్చారని అఖిలేష్ ఆరోపించారు. 2027లో జరగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈసీఐ, బీజేపీ కలిసి ఈ మోసానికి తెరతీశారన్నారు. ఈ మేరకు గురువారం యూపీ రాజధాని లక్నోలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈసీఐ, సర్ ప్రక్రియ, బీజేపీపై విమర్శలు చేశారు. "యూపీలో 19,20,732 దొంగ ఓట్లను సమాజ్‌వాదీ పార్టీ గుర్తించింది. ఇందులో ఎలక్షన్ కమిషన్ ప్రచురించని 16.18 లక్షల ఓట్లు ఉన్నాయి. మరో మూడు లక్షల అనుమానిత ఓట్లు ఉన్నాయి. ఈ జాబితా కోసం బూత్ లెవెల్ ఆఫీసర్లపై, ప్రభుత్వ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక 29 మంది సిబ్బంది కూడా మరణించారు. యూపీలో అక్టోబర్ 2025 నుంచి ఏప్రిల్ 2026 మధ్య సర్ ప్రక్రియ జరిగింది. అనంతరం ఓటర్ లిస్ట్ వెల్లడైంది. ఇందులో 87.56 లక్షల ఫాం 6 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొత్త ఓటర్లు కూడా ఉన్నారు. చివరి జాబితాలో 84.3 లక్షల కొత్త ఓటర్లు చేరారు. మొత్తం 87.56 లక్షల ఫాంలు రాగా.. వాటిలో 71.38 లక్షల దరఖాస్తుల వివరాల్ని మాత్రమే ఈసీ బహిరంగంగా ప్రచురించింది. మిగతా 16 లక్షల ఓటర్ల వివరాలు ప్రచురించలేదు" అని అఖిలేష్ ఆరోపించారు. జాబితాలో ప్రచురించకుండానే దాదాపు 19 లక్షల కొత్త ఓటర్లు చేరారని అఖిలేష్ విమర్శించారు. ఎన్నికల సంఘాన్ని బీజేపీ బలహీనపరుస్తోందని ఆయన ఆరోపించారు. ఈసీఐ, బీజేపీ కలిసి ఎన్నికల్లో భారీ కుట్రకు తెరతీశాయన్నారు. బీజేపీ ఓడిపోతామనే భయం ఉన్న నియోజకవర్గాల్లోనే ఓటర్ల జాబితాలో ఇలాంటి మార్పులు ఉన్నాయని అఖిలేష్ వివరించారు.

అమెరికాలో దేవాలయంపై దాడికి కుట్ర

తీవ్రంగా స్పందించిన భారత ప్రభుత్వం

అరోరా: అమెరికాలోని ఓ హిందూ దేవాలయంలో కాల్పులకు టీనేజర్ పన్నిన కుట్ర వార్తలపై భారత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ కుట్రను 'జాతి వివక్ష, హిందూ వ్యతిరేక చర్య'గా అభివర్ణించిన భారత విదేశాంగ శాఖ.. ఇది ఎంతో ఆందోలనకు గురిచేస్తోందని పేర్కొంది. ఇల్లినాయిస్‌లోని అరోరా ప్రాంతంలో ఉన్న హిందూ ఆలయంపై దాడికి కుట్ర పన్నాడనే ఆరోపణలతో పాలటైన్‌కు చెందిన అలెగ్జాండ్రోస్ పాపోరాకిస్ అనే 19 ఏళ్ల యువకుడిని అమెరికా పోలీసులు అరెస్ట్ చేశారు. "ఇల్లినాయిస్‌లోని అరోరా ప్రాంతంలో ఉన్న హిందూ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులకు పన్నిన కుట్ర నివేదికలపై మేము తీవ్ర ఆందోళన చెందుతున్నాం. భారత సంతతికి చెందిన ప్రజలపై హింసకు ప్రేరేపించేలా ఉన్న ఈ కుట్రలోని హిందూ వ్యతిరేక, జాతి వివక్ష కోణాలు అత్యంత దిగ్భ్రాంతికరం" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. అధికారుల సమాచారం ప్రకారం.. పాలటైన్‌కు చెందిన అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ వద్ద జాత్యహంకార భావజాలం, 'భారత సంతతి' ప్రజలపై హింసను ప్రేరేపించే అంశాలతో కూడిన మ్యానిఫెస్టోను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. "ఈ వ్యవహారంలో అనుమానితుడిని అరెస్ట్ చేయడం, చట్టపరమైన కేసులు నమోదు చేయడం సహా అమెరికా చట్ట అమలు సంస్థలు తీసుకున్న చర్యలను మేము గమనించాం" అని జైస్వాల్ అన్నారు. అమెరికాలో పెరుగుతున్న జాతి వివక్ష, భారత్ పట్ల వ్యక్తమవుతున్న ద్వేషపూరిత ధోరణులపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఇటువంటి ఘటనల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. "ఈ ఘటన అమెరికాలో పెరుగుతున్న జాతి విద్వేషం, భారత్ వ్యతిరేక ధోరణులపై మరింత ఆందోళన కలిగిస్తోంది. భారతీయ సమాజ భద్రత, రక్షణను నిర్ధారించడానికి మరింత జాగ్రత్త వహించడం, ద్వేషపూరిత హింసపై కఠినంగా వ్యవహరించడం, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడం చాలా అవసరం" అని జైస్వాల్ స్పష్టం చేశారు.

13.38 లక్షల కోట్ల పన్నుల వసూళ్లు

కేంద్ర ఖజానాకు భారీ ఆదాయం

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నట్లు సూచిస్తూ ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో భారీ వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో అక్టోబర్ 14 నాటికి నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.13.38 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 13.21 శాతం అధికమని ఆదాయ పన్ను శాఖ నేడు విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కార్పొరేట్ పన్ను, నాన్-కార్పొరేట్ పన్ను (వ్యక్తిగత ఆదాయ పన్ను), 'సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్' (ఎస్‌టీటీ) వసూళ్లు పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. రిఫండ్‌లను సర్దుబాటు చేయకముందు, స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 14.89 శాతం పెరిగి రూ.16.03 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ వసూళ్లు రూ.13.95 లక్షల కోట్లుగా ఉన్నాయి. మరోవైపు ఈ ఏడాది పన్ను చెల్లింపుదారులకు జారీ చేసిన రిఫండ్‌లు కూడా గణనీయంగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే రిఫండ్‌లు 24.22 శాతం పెరిగి రూ.2.65 లక్షల కోట్లకు చేరినట్లు అధికారిక డేటా వెల్లడించింది. విభాగాల వారీగా పరిశీలిస్తే.. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.4.97 లక్షల కోట్ల నుంచి రూ.5.99 లక్షల కోట్లకు పెరిగాయి. వ్యక్తులు, ఇతర సంస్థలు చెల్లించే నాన్-కార్పొరేట్ పన్నుల నికర వసూళ్లు రూ.6.54 లక్షల కోట్ల నుంచి రూ.6.92 లక్షల కోట్లకు చేరాయి. ముఖ్యంగా స్టాక్ మార్కెట్ లావాదేవీలపై విధించే ఎస్‌టీటీ నికర వసూళ్లు రూ.30,901 కోట్ల నుంచి రూ.46,840 కోట్లకు పెరిగి బలమైన వృద్ధిని నమోదు చేశాయి.

1,500 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,500 పాయింట్లకు పైగా ఎగబాకగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 23 వేల మార్కుకు చేరువైంది. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు ఊతమిచ్చాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 4 శాతానికి పైగా పెరిగింది. ముడిచమురు ధరలు తగ్గడం, రూపాయి నిలకడగా ఉండటం, విదేశీ పెట్టుబడులు తిరిగి వచ్చే అవకాశాలపై ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. సెన్సెక్స్ 1,533.72 పాయింట్లు పెరిగి 74,315.61 వద్ద ముగిసింది. నిఫ్టీ 374.65 పాయింట్లు లాభపడి 22,997.35 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లు బలహీనపడినప్పటికీ, దేశీయంగా భారీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోని కంపెనీల అధిక విలువలపై ఆందోళనలు, అమెరికాలో అంచనాలను మించిన ద్రవ్యోల్బణం ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత మార్కెట్లపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సెన్సెక్స్‌లో టెక్ మహీంద్రా అత్యధికంగా 4.61 శాతం లాభపడింది. ఐసీఐసీఐ బ్యాంక్ 4.17 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.03 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 2.94 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 2.58 శాతం పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లూ లాభాల్లో ముగిశాయి. మరోవైపు భారత్ ఎలక్ట్రానిక్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి.

ఎస్ఐఆర్‌పై రాహుల్ పిటిషన్

ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భారీగా ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నేడు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎస్ఐఆర్ వ్యవహారంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఇటీవల సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లి ఉమ్మడి పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన ఓట్ల తొలగింపులు, మార్పులపై స్వతంత్రంగా ఆడిట్ నిర్వహించాలని ప్రతిపక్ష నేతలు కోరారు. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సాంకేతిక నిపుణులు, ప్రముఖ పౌరులతో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఓటరునైనా ముందస్తు నోటీసు ఇవ్వకుండా, తన వాదన వినిపించే అవకాశం కల్పించకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పంజాబ్‌తో పాటు ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాల్లో అర్హులైన ఓటర్లు చట్టం అనుమతించిన చివరి తేదీ వరకు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పిటిషన్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కూడా అభ్యర్థించారు. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ ప్రసాద్ యాదవ్, సౌగతా రాయ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, డి.రాజా తదితరులు ఈ పిటిషన్‌లో సహ పిటిషనర్లుగా ఉన్నారు.

ఇండియన్ కోస్ట్ గార్డ్స్‌లో 365 ఉద్యోగాలు

న్యూఢిల్లీ: భారత తీరరక్షక దళం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ అందించింది. మొత్తం 365 పోస్టులకు కోస్ట్ గార్డ్ ఎన్‌రోల్డ్ పర్సనల్ టెస్ట్-01/2027, 02/2027 బ్యాచ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో నావిక్ (జనరల్ డ్యూటీ), యాంత్రిక్, హైజీనిస్ట్ పోస్టులు ఉన్నాయి. అర్హత, ఆసక్తి ఉన్నవారు అధికారిక వెబ్‌సైట్‌లో అక్టోబర్ 21 వరకు పురుషులతో పాటు అర్హులైన మహిళలూ దరఖాస్తు చేసుకోవచ్చు. రాతపరీక్ష, శరీర దారుఢ్య, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అభ్యర్థుల ఎంపిక చేయనుంది. ఎంపికైన వారికి ముందుగా శిక్షణ ఇస్తారు. అనంతరం విధుల్లోకి తీసుకుంటారు. నావిక్ పోస్టులకు రూ.21,700ం అలవెన్సులు, యాంత్రిక్ పోస్టులకు రూ.29,200 అలవెన్సులు ప్రతినెల జీత వస్తుంది.

బాలెన్ షా.. భారత్‌కే జై

ఇండియాకే నేపాల్ ప్రధాని తొలి ప్రాధాన్యం

న్యూడిల్లీ: నేపాల్ ప్రధాని బాలెన్ షా ఆనవాయితీకి చెక్ పెట్టారు. జెన్‌జీ ప్రతినిధిగా ప్రధాని పదవి చేపట్టిన ఆయన కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ద్వైపాక్షిక చర్చల కోసం భారత్‌ను ఎంచుకున్నారు. తనకంటే ముందువారు తొలుత చైనా, టర్కీ, యూకే.. వంటి దేశాలకు వెళ్లగా తను మాత్రం ఇండియాకు తొలి ప్రధాన్యమిచ్చారు. ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన చర్చల కోసం నవంబర్‌లో ఆయన విచ్చేస్తున్నారు. బాలెన్ షా ప్రధాని అయ్యాక దేశ ప్రయోజనాల కోసం చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే కావడం విశేషం. జెన్‌జీ ఆందోళనల అనంతరం నేపాల్ ప్రధాని పీఠంపై కూర్చున్న బాలెన్ షా త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ఆనవాయితీ ప్రకారం మాజీ ప్రధానులు తమ తొలి విదేశీ పర్యటనకు ఇతర దేశాలను ఎంచుకోగా ఆయన మాత్రం ఇండియాకు ఓటేశారు. మార్చిలో ప్రధాని పదవి చేపట్టిన ఆయన తొలుత భారత దైత్యాధికారులతో మాట్లాడేందుకు నిరాకరించినా.. చివరకు పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నవంబర్‌లోనే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక చర్చల కోసం బాలెన్ షా విచ్చేస్తున్నారు. నవంబర్ రెండు లేదా మూడో వారంలో ఆయన ఇండియా రానున్నారు. ఖాట్మండు పోస్ట్ కథనం ప్రకారం ఈ పర్యటన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన ప్రధాన నిర్మాణపరమైన ప్రాజెక్టులు, సరిహద్దు వివాదాలు, వరదల నియంత్రణ చర్యలు వంటి అంశాలపై చర్చించే అవకాశముంది.

ఎస్బీఐ గృహ, వాహన రుణాలపై వడ్డీ పెంపు

న్యూఢిల్లీ: దిగ్గజ ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణగ్రహీతలపై వడ్డీ భారాన్ని పెంచింది. వివిధ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తూ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. సవరించిన ఈ నూతన రేట్లు 2026 అక్టోబర్ 15వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర పెంచిన నేపథ్యంలో ఎస్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపుతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు సంబంధించిన నెలవారీ వాయిదాలు (ఈఎంఐలు) పెరగనున్నాయి.

నైజీరియాలో ఐఎస్ బీభత్సం

సైనిక స్థావరంపై దాడిలో 20 మంది మృతి

న్యూఢిల్లీ: నైజీరియాలో ఉగ్రవాదులు మరోసారి పెను విధ్వంసం సృష్టించారు. ఈశాన్య నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో ఉన్న ఓ సైనిక స్థావరంపై ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ ఉగ్రవాదులు మంగళవారం రాత్రి భీకర దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 15 మంది సైనికులు, ఐదుగురు పౌర సేన సభ్యులు (యాంటీ-జిహాదిస్ట్ మిలీషియా) మరణించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. లేక్ చాద్ ప్రాంతంలోని మైరారీ గ్రామంలో ఉన్న ఈ సైనిక స్థావరాన్ని ఉగ్రవాదులు పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆయుధాలను దోచుకుని, స్థావరంలో ఉన్న వాహనాలతో సహా అన్నింటికీ నిప్పుపెట్టి బేస్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన సైనికులు సమీపంలోని మోంగునో పట్టణానికి చేరుకున్నారు. మరికొందరు సైనికుల ఆచూకీ గల్లంతవగా, వారిని ఉగ్రవాదులు బంధించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, రాత్రి 10 గంటల ప్రాంతంలో మొదలైన ఈ దాడి ఉదయం వరకు కొనసాగింది. ఉగ్రవాదులు సైనికులను తరిమికొట్టి, స్థావరంలోని విలువైన వస్తువులన్నింటినీ దోచుకుని, మిగిలిన వాటిని తగలబెట్టారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పొరుగున ఉన్న గుడుంబాలి ప్రాంతం నుంచి ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు భావిస్తున్నారు.

ఉక్రెయిన్ డ్రోన్లకు బ్రేకులు

అమెరికా నియంత్రణలోనే స్టార్‌షీల్డ్ వ్యవస్థలు

ఆంక్షలపై తుది నిర్ణయం ట్రంప్ ప్రభుత్వానిదే: మస్క్

న్యూయార్క్: ఉక్రెయిన్‌లో సైనిక కార్యకలాపాల కోసం వినియోగిస్తున్న 'స్టార్‌షీల్డ్' శాటిలైట్ కమ్యూనికేషన్స్ వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడటంపై స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవస్థపై విధించే ఎలాంటి పరిమితులైనా అమెరికా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని, అంతిమ నిర్ణయం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటారని ఆయన స్పష్టం చేశారు. యుద్ధ క్షేత్రంలో డ్రోన్ కార్యకలాపాలకు ఊహించని విధంగా ఆంక్షలు విధిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉక్రెయిన్ అధికారులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మస్క్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఎలాన్ మస్క్ ఒక పోస్ట్ చేశారు. "స్టార్‌షీల్డ్ వ్యవస్థలు అమెరికా ప్రభుత్వ యాజమాన్యంలో, వారి నియంత్రణలో ఉంటాయి. దాని వేగం లేదా వినియోగంపై ఎలాంటి పరిమితులు విధించాలన్నా అమెరికా మిలిటరీ, అంతిమంగా అమెరికా అధ్యక్షుడే నిర్ణయిస్తారు" అని మస్క్ స్పష్టం చేశారు. సైనిక అవసరాల కోసం ఉద్దేశించిన స్టార్‌షీల్డ్‌కు, వాణిజ్యపరమైన స్టార్‌లింక్‌కు మధ్య తేడా ఉందని ఆయన వివరించారు. స్టార్‌లింక్‌ను కేవలం పౌర, రక్షణ కార్యకలాపాలకే పరిమితం చేశామని, దాడులకు సంబంధించిన సైనిక చర్యలకు దానిని ఉపయోగించలేరని తెలిపారు.

కొత్త సేవలపైనే మా దృష్టి

ఐపీఓ ముందు ఆకాశ్ అంబానీ ప్రకటన

ముంబై: దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతున్న జియో ప్లాట్‌ఫామ్స్ తన భవిష్యత్ వ్యూహాలపై కీలక ప్రకటన చేసింది. కేవలం మొబైల్ టారిఫ్ ధరలు పెంపు ద్వారానే కాకుండా, వినియోగదారులకు వినూత్న సేవలను చేరువ చేయడం ద్వారా ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ స్పష్టం చేశారు. అయితే, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరల పెంపు అనేది ఎప్పుడూ ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుందని ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు. గురువారం ముంబైలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆకాశ్ అంబానీ కంపెనీ వృద్ధి ప్రణాళికలను వివరించారు. "టెలికాం రంగంలో టారిఫ్ ధరల పెంపు అనేది ఎప్పుడూ అందుబాటులో ఉండే ఒక అవకాశం. పరిస్థితులను బట్టి దానిపై నిర్ణయాలు ఉంటాయి. అయితే, రిలయన్స్ జియో వ్యూహం కేవలం డేటా ధరలపైనే ఆధారపడి ఉండదు. వినియోగదారులకు అదనపు విలువ కలిగిన సేవలను అందించి, తద్వారా రాబడిని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన వెల్లడించారు.

ఫైనల్ వార్నింగ్, ఇంటికి వెళ్లిపోండి

యూకేలో భారత విద్యార్థులకు వేధింపులు

లండన్: బ్రిటన్‌లో భారతీయ విద్యార్థులకు తీవ్రమైన వేధింపులు ఎదురయ్యాయి. తమను తాము 'చెల్మ్‌స్లీ వుడ్ పేట్రియాట్స్'గా పిలుచుకునే ఓ విజిలెంట్ గ్రూప్, వెస్ట్ మిడ్‌లాండ్స్‌లోని మెరిడెన్ పార్క్‌లో రాత్రి సమయంలో కొందరు భారత విద్యార్థులను అడ్డగించి బెదిరించింది. 'ఇంటికి వెళ్లిపోండి' అని హెచ్చరించడమే కాకుండా, మళ్లీ పార్క్ వద్ద కనిపించొద్దని 'ఫైనల్ వార్నింగ్' ఇచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'మహిళలు, చిన్నారుల రక్షణ' పేరుతో రాత్రివేళ గస్తీ నిర్వహిస్తున్నామని చెప్పుకుంటూ వచ్చిన ఆ బృందం సభ్యులు, అక్కడ ఉన్న భారత విద్యార్థులను చుట్టుముట్టారు. "మీరు ఇంగ్లాండ్‌కు ఎందుకు వచ్చారు?" అంటూ వారిని వేధించారు. తాము బర్మింగ్‌హామ్‌లో నివసిస్తున్నామని, ఆ రోజే మాత్రమే ఈ ప్రాంతానికి వచ్చామని ఒక విద్యార్థి వివరించగా, మరొకరు తాను మాస్టర్స్ డిగ్రీ అభ్యసించేందుకు రెండేళ్లుగా యూకేలో ఉంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు వివరణ ఇచ్చినప్పటికీ, ఆ బృందం సభ్యులు అత్యంత దురుసుగా ప్రవర్తించారు. "మీరు పిల్లల పార్కుకు దూరంగా ఉండాలి, మళ్లీ ఈ ప్రాంతంలో కనిపిస్తే మర్యాదగా ఉండదు. ఇదే మీకు ఆఖరి హెచ్చరిక" అని వారిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ మొత్తం ఉదంతాన్ని ఆ బృందమే వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. అనంతరం ఆ వీడియోను తొలగించినప్పటికీ, అప్పటికే అది ఇతర మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించింది.

తుది దశలో ఇండో-అమెరికా ట్రేడ్ డీల్ డ్రాఫ్ట్

కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్

న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. "అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి విడత చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు. ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డ

రణబాలి.. రణబాలి..!

ఎక్కడ చూసినా ఇదే ముచ్చట.. నేడు విడుదల కానున్న సినిమా

కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా 'రణబాలి' సినిమాను గురించే అంతా మాట్లాడుకుంటున్నారు. అందుకు కారణం ఈ కథా నేపథ్యం .. విజయ్ దేవరకొండ – రష్మిక విలక్షణమైన లుక్ .. అనే చెప్పాలి. సాధారణంగా ఒక కథకు చరిత్ర తోడైనా.. ఒక పోరాటానికి ప్రేమ తోడైనా ఆ కథపై అందరిలో మరింత ఆసక్తి కలుగుతుంది .. కుతూహలం పెరుగుతుంది. అయితే చరిత్ర .. పోరాటం .. ప్రేమ .. అనే ఈ మూడు అంశాలను కలుపుకుంటూ అల్లుకున్న కథగా 'రణబాలి' కనిపిస్తుంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా, శుక్రవారం థియేటర్లలో దిగిపోనుంది. రాహుల్ సాంకృత్యన్ ఇంతవరకూ తెరకెక్కించిన సినిమాలను ఒకసారి పరిశీలన చేస్తే, ఎప్పటికప్పుడు ఆయన ప్రయోగాల దిశగా అడుగులు వేయడం కనిపిస్తుంది. విభిన్నమైన కథాంశాలను ఎంచుకుంటూ .. వాటిని అందంగా ఆవిష్కరించుకుంటూ వెళ్లిన విధానం తెలుస్తుంది. అలా రూపొందిన సినిమానే 'రణబాలి'గా చెప్పుకోవచ్చు. ఇంతవరకూ విజయ్ దేవరకొండ – రష్మిక రెండు సినిమాలలో నటించినప్పటికీ, ఇది పూర్తిగా భిన్నమైనదిగా చెప్పుకోవలసి ఉంటుంది. పెళ్లి తరువాత వాళ్లు కలిసి చేసిన ఫస్టు మూవీగా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది.

ప్రతి భారతీయుడు ఈ సినిమా చూడాలి: అన్నామలై

మాజీ ఐపీఎస్ అధికారి, ప్రముఖ రాజకీయ నాయకుడు అన్నామలై, న్యాయవాది జె.సాయి దీపక్‌లతో విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ ప్రత్యేకంగా ముచ్చటించారు. 'రణబాలి హిస్టారిక్ కన్వర్జేషన్' పేరుతో జరిగిన ఈ చర్చలో విజయ్ దేవరకొండ.. అన్నామలైపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. 1854-1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో సంభవించిన ఘోర కరవు, ఆ సమయంలో బ్రిటిషర్ల దాష్టీకాలను కళ్లకు కట్టేలా చూపించబోతున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ నేపథ్యంలో జరిగిన చర్చలో అన్నామలై మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాల్లో చెప్పని ఎన్నో చారిత్రక వాస్తవాలను ఈ సినిమా ద్వారా చెప్పే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. బ్రిటిషర్లు



తమ వ్యవస్థలను అడ్డం పెట్టుకొని చరిత్రలోని ఎన్నో నిజాలను తొక్కిపెట్టారని, వాటిని వెలికితీస్తున్న 'రణబాలి' చిత్రాన్ని ప్రతి భారతీయుడు తప్పక చూడాలని ఆయన పిలుపునిచ్చారు.

పుట్టపర్తిలో విజయ్ దంపతుల పూజలు

రణబాలి సినిమా విడుదల వేళ ప్రముఖ టాలీవుడ్ జంట విజయ్ దేవరకొండ మరియు రష్మిక మందన్న శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. పుట్టపర్తిలో జరుగుతున్న వార్షిక వేద పురుష సప్తహ జ్ఞాన యజ్ఞం వేడుకల్లో భాగంగా ఈ జంట సాయి కుల్వంత్ హాల్‌ను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రశాంతి నిలయంలో జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో విజయ్, రష్మిక కలిసి పాల్గొనడం పట్ల అభిమానులు సోషల్ మీడియాలో విశేషంగా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా విజయ్ దేవరకొండకు పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విద్యాసంస్థలతో ప్రత్యేక అనుబంధం ఉండటంతో, ఈ ఆధ్యాత్మిక యాత్రకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

కరికాలలో గాయత్రి భరద్వాజ్ కూడా..!

మిస్ ఇండియా విన్నర్ తెలుగులో ఓ సినిమా చేస్తోంది. ఓ సోషియో ఫాంటసీ మూవీలో యువరాణిగా కనిపించబోతుంది. రిజల్ట్‌తో సంబంధం లేకుండా హీరోగా వరుసగా సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు సందీప్ కిషన్. ఇటీవలే సిగ్మా మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ డిజాస్టర్‌గా నిలిచింది. తాజాగా సందీప్‌కిషన్ కెరీర్‌లో ఫస్ట్ టైమ్ సోషియో ఫాంటసీ మూవీ చేయబోతున్నాడు. కరికాల పేరుతో రూపొందుతోన్న ఈ మూవీ రెండ్ పార్ట్‌లుగా రిలీజ్ కాబోతుంది. ఈ మైథాలజీ మూవీలో సందీప్‌కిషన్ సరసన ముగ్గురు హీరోయిన్లు నటించబోతున్నారు. కరికాల మూవీ పూజా కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈఓపెనింగ్ వేడుకలో నాయకానాయికలు పాల్గొన్నారు. సోషియో ఫాంటసీ మూవీలో చారిత్రక యోధుడి పాత్రలో సందీప్‌కిషన్ కనిపించబోతున్నాడు. కరికాలలో కేథరిన్, సాక్షి మడోల్కర్‌తో పాటు మిస్ ఇండియా గాయత్రి భరద్వాజ్ కథానాయికలుగా కనిపించబోతున్నారు.

పెళ్లికి ముందే బిడ్డను కనాలనుంది: అనుపమ

రెమ్యూనరేషన్ కోసం ఆలోచించి సినిమాలు చేయనని అన్నది అనుపమ పరమేశ్వరన్. కథ, పాత్రల పరంగా ప్రయోగాలు చేయడమే తనకు ఇష్టమని తెలిపింది. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించి క్రేజీ కళ్యాణం మూవీ అక్టోబర్ 16న థియేటర్లలోకి రాబోతుంది. భద్రప్ప గాజుల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ నరేష్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ కీలక పాత్రలు పోషించారు. 'క్రేజీ కళ్యాణం సినిమాకు ముందు వేరే వర్కింగ్ టైటిల్ అనుకున్నాం. ఈ సినిమా చేస్తున్న క్రమంలో ప్రతీది క్రేజీగా అనిపించాయి. దాంతో మా డైరెక్టర్ క్రేజీ కల్యాణం అని టైటిల్ బాగుంటుందని ఫిక్స్ అయ్యారు. వినోదంతో పాటు భావోద్వేగాల కలబోతగా ఈ సినిమా ఉంటుంది. నాతో పాటు సీనియర్ నరేష్, అఖిల్, తరుణ్ భాస్కర్ ప్రతి పాత్రకు ప్రాధాన్యముంటుంది. ప్రస్తుతం వ్యక్తిగత జీవితంలో నేను చాలా సంతోషంగా ఉన్నా. అందుకే ప్రమోషన్స్‌ను ఎంజాయ్ చేస్తున్నా. పెళ్లికి ముందే బిడ్డను కనాలని ఉంది. ఇందులో కీర్తి అనే పాత్ర పోషించా. క్రేజీ కళ్యాణం మూవీ కథ నా పెళ్లిచూట్టునే తిరుగుతుంది. చివరకు కీర్తి పెళ్లి జరుగుతుందా? లేదా? అన్నది స్క్రీన్‌పై చూడాల్సిందే. సినిమాలో మాదిరిగా మా ఇంట్లో నా పెళ్లి గురించి ఏమాత్రం ఒత్తిడి లేదు. నీకు ఇష్టమైనప్పుడు పెళ్లి చేసుకోమనే మా అమ్మనాన్నలు చెప్పారు. ఆ విషయంలో నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. నాకైతే పెళ్లికి ముందే ఓ బిడ్డకు తల్లి కావాలని ఉంది.

ప్రైమ్‌లోకి రానున్న జైలర్ 2

రజనీకాంత్ హీరోగా నటించిన జైలర్ 2 గురువారం తెలుగుతో పాటు తమిళ భాషల్లో రిలీజైంది. నెల్సన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రమ్యకృష్ణ, మిర్నా మీనన్, విద్యా బాలన్, ఎస్‌జే సూర్య కీలక పాత్రల్లో నటించారు. బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్‌తో పాటు విజయ్ సేతుపతి, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ గెస్ట్ పాత్రల్లో నటించారు. జైలర్ 2 సినిమాకు వరల్డ్ వైడ్‌గా పాజిటివ్ టాక్ లభిస్తోంది. రజనీకాంత్ హీరోయిజం, ఎలివేషన్లను పతాక స్థాయిలో డైరెక్టర్ నెల్సన్ ఆవిష్కరించాడంటూ చెబుతోన్నారు. గెస్ట్ రోల్స్‌ను వాడుకున్న తీరు, కామెడీ, అనిరుధ్ బీజీఎమ్ అదిరిపోయాయని ఫ్యాన్స్ నుంచి ప్రశంసలు వస్తోన్నాయి. కథలో కొత్తదనం లేదని, సెకండాఫ్‌ను థ్రిల్లింగ్‌గా ఆవిష్కరించడంలో డైరెక్టర్ తడబడిపోయాంటూ విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. నెగెటివ్ టాక్‌తో సంబంధం లేకుండా తొలిరోజు జైలర్ 2 రికార్డ్ కలెక్షన్స్‌ను రాబట్టడం ఖాయమని ట్రేడ్ వర్గాలు చెబుతోన్నాయి. రజనీకాంత్ కెరీర్‌లో హయ్యెస్ట్ ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. కాగా జైలర్ 2 ఓటీటీ ప్లాట్‌ఫామ్ కన్ఫామ్ అయ్యింది. రజనీకాంత్ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ సొంతం చేసుకుంది. జైలర్ పెద్ద హిట్టవడం, సీక్వెల్‌లో రజనీకాంత్‌తో పాటు పలువురు స్టార్స్ నటించడంతో జైలర్ 2 ఓటీటీ రైట్స్ కోసం గట్టి పోటీ ఏర్పడింది.

పూనమ్ రౌత్ రిటైర్మెంట్

భారత మహిళా క్రికెటర్ పూనమ్ రౌత్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. 13 ఏళ్ల సుదీర్ఘ ఇంటర్నేషనల్ కెరీర్‌కు గురువారం వీడ్కోలు పలికింది. 'ముంబై వీధుల నుంచి భారత జెర్సీ ధరించే వరకూ ఈ ప్రయాణం వరం లాంటిది. ఈ జర్నీ త్యాగాలు, పోరాటాలు, మరుపురాని విజయాలు, కఠిన పాఠాలు.. జీవితాంతం గుర్తుంచుకునే క్షణాలతో నిండిపోయింది. ఇండియాకు ప్రాతినిధ్యం వహించడం అనేద నెరవేరిన నా కల మాత్రమే కాదు. నాకు గొప్ప గౌరవం. నా అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ముగిస్తున్నా. క్రికెట్ నాకు కేవలం కెరీర్ మాత్రమే ఇవ్వలేదు. లక్ష్యాన్ని, గుర్తింపును, కుటుంబాన్ని ఇచ్చింది.'అని తెలిపింది. ప్లేయర్‌గా ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా ఆటకు తిరిగి సేవ చేయడమే తన తదుపరి లక్ష్యమని చెప్పింది. 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన రౌత్ 13 ఏళ్లు టీమిండియాకు ప్రాతినిధ్యం వహించింది. ఆమె చివరిసారిగా 2021లో భారత్ తరపున ఆడింది. 73 వన్డేలు, 35 టీ20లు, నాలుగు టెస్టులు ఆడింది.

బీసీసీఐ నాకు ప్రాణం పోసింది

క్రిస్ గేల్‌ప్రపంచ క్రికెట్‌లో 'యూనివర్స్ బాస్'గా గుర్తింపు తెచ్చుకున్న వెస్టిండీస్ విధ్వంసకర ఓపెనర్ క్రిస్ గేల్ తన కష్టకాలంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి అందించిన సహాయాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగ ప్రకటన చేశారు. 2009వ సంవత్సరంలో తాను తీవ్రమైన వెన్నునొప్పితో కెరీర్ ముగిసిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొన్న సమయంలో బీసీసీఐ తనకు పునర్జన్మ నిచ్చిందని గేల్ వెల్లడించారు. ఆ సమయంలో అత్యవసరంగా శస్త్రచికిత్స చేయించుకోవడానికి తన వద్ద తగినంత డబ్బు లేకపోవడంతో సొంత దేశ క్రికెట్ బోర్డును (క్రికెట్ వెస్టిండీస్) సంప్రదించినప్పటికీ ఎవరూ ముందుకు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న తనకు భారత క్రికెట్ బోర్డు ఆపద్బాంధవుడిలా నిలిచిందని గేల్ పేర్కొన్నారు. తాను ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితిని తెలుసుకున్న వెంటనే బీసీసీఐ స్పందించి ఇంగ్లాండ్‌లో అత్యాధునిక శస్త్రచికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందని క్రిస్ గేల్ తెలిపారు. ఆ చికిత్స విజయవంతం కావడం వల్లే తాను మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టి తన అంతర్జాతీయ కెరీర్‌ను విజయవంతంగా కొనసాగించగలిగానని స్పష్టం చేశారు. "నా క్రికెట్ ప్రయాణం మళ్లీ గాడిన పడటానికి కారణమైన బీసీసీఐకి, భారత క్రికెట్ యాజమాన్యానికి నా జీవితాంతం రుణపడి ఉంటాను" అంటూ గేల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కష్టాల్లో ఉన్న ఆటగాడికి సరిహద్దులతో సంబంధం లేకుండా అండగా నిలిచిన బీసీసీఐ ఔదార్యంపై క్రీడా వర్గాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

విశ్వజిత్ మోరె వెండి వెలుగులు

వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో రజతం

భారత యువ రెజ్లర్ విశ్వజిత్ మోరె చరిత్ర సృష్టించాడు. అండర్-23 గ్రీకో రోమన్ విభాగంలో రజతం గెలిచిన వీరుడిగా రికార్డు నెలకొల్పాడు. పురుషుల 55 కిలోల విభాగంలో గురువారం ఒక్క పాయింట్ తేడాతో స్వర్ణం చేజార్చుకున్నాడతడు. హోరాహోరీగా సాగిన పోరులో జార్జియాకు చెందిన కొబ కరుమిడ్జే చేతిలో మోరె ఓడిపోయాడు. పసిడి కల చెదిరినా.. ఈ విభాగంలో రెండో స్థానంలో నిలిచిన భారత కుస్తీ చిన్నోడిగా అవతరించాడు. కుస్తీ ఆటలో విశ్వ వేదికపై మరో భారత కుర్రాడు మెరిశాడు. అమెరికాలోని లాస్ వేగాస్‌లో జరుగుతున్న అండర్-23 వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో అదిరే పట్టుతో అదరగొట్టిన విశ్వజిత్ మోరె వెండి వెలుగులు విరజిమ్మాడు. గ్రీకో రోమన్ పురుషుల 55 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు.. ఫైనల్లో మాత్రం తడబడ్డారు. ఆద్యంతం ఉత్కంఠ రేపిన పసిడి పోరులో కొబ కరుమిడ్జే(జార్జియా)కు గట్టిపోటీనిచ్చిన మోరె ఒక్క పాయింట్ తేడాతో ఓడాడు. మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన భారత కుర్రాడు 12-13తో వెనకబడి సిల్వర్ మెడల్‌తో సరిపెట్టుకున్నాడు. అయినా సరే అండర్-23 వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ గ్రీకో రోమన్ విభాగంలో ఫైనల్ ఆడిన తొలి ఇండియన్ రెజ్లర్‌గా మోరె చరిత్ర లిఖించాడు. ఇదే పోటీల్లో.. చేతన్ (63 కిలోలు), కరణ్ కంబోజ్ (87 కిలోలు) పతక పోరుకు అర్హత సాధించలేదు. అయితే.. మహిళల విభాగంలో కోమల్, దీక్షా మాలిక్(68 కిలోలు)లు కాంస్యం పతకం కోసం బరిలోకి దిగనున్నారు.

140 కోట్ల భారతీయులకు గర్వకారణం

ఆసియా గేమ్స్ పతక విజేతలకు ప్రధాని మోదీ అభినందనలు

ఇటీవల ఆసియా గేమ్స్-2026లో పతకాలు సాధించిన భారత అథ్లెట్లను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం ఢిల్లీలోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పతక విజేతలను ప్రధాని అభినందించారు. 140 కోట్ల భారతీయులకు గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. ఈ సందర్భంగా మహిళా అథ్లెట్లను ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్ గెలిచిన 85 పతకాల్లో 38 మెడల్స్ మహిళలే గెలిచారు. అలాగే, 44 ఏళ్ల తర్వాత ఆసియా గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మహిళల హాకీ జట్టు విజయాన్ని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ ఇతర ఈవెంట్లలో తొలిసారిగా మెడల్ సాధించిన విషయాన్ని ప్రస్తావించారు.

స్మృతికి తొలి సవాల్

నేడు జింబాబ్వేతో తొలి టీ20

దాదాపు దశాబ్దంపాటు భారత మహిళల క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించిన హర్మన్‌ప్రీత్ కౌర్ ఇటీవలే కెప్టెన్సీకి గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో బీసీసీఐ స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు జట్టు పగ్గాలు అప్పగించింది. దీంతో భారత మహిళల క్రికెట్‌లో సారథిగా స్మృతి తరం మొదలైంది.

జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌తో కెప్టెన్‌గా ఆమె తొలి సవాల్ ఎదుర్కోబోతుంది. ఇప్పటివరకు వరల్డ్ క్లాస్ బ్యాటర్‌గా స్మృతి ఎన్నో ఘనతలు సాధించింది. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు కెప్టెన్‌గా కొత్త పాత్రలో ఆమె ఏ మేరకు సక్సెస్ అవుతుందోనని అందరిలో ఆసక్తి నెలకొంది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు, గతంలో హర్మన్ గైర్హాజరీలో భారత జట్టుకు కెప్టెన్‌గా చేసిన అనుభవం స్మృతికి ఉంది. నేడు రాయ్‌పూర్ వేదికగా తొలి టీ20 జరగనుంది. మొదటి మ్యాచ్‌లో విజయం సాధించి కెప్టెన్‌గా తన ప్రయాణాన్ని విజయంతో మొదలుపెట్టాలని స్మృతి ఆశిస్తోంది. భారత మహిళల క్రికెట్‌పై కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ చెరగని ముద్ర వేసిందనడంలో సందేహం లేదు. దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ నాయకత్వంలో భారత జట్టు ఓ దారిలో పడగా.. జట్టును అత్యున్నత స్థాయిలో నిలబెట్టింది మాత్రం హర్మనే. ఆమె నాయకత్వంలో గతేడాది భారత జట్టు తొలిసారిగా ఐసీసీ వన్డే వరల్డ్ కప్ గెలిచింది. భారత మహిళల క్రికెట్‌లో ఇది సువర్ణాధ్యాయంగా చెప్పుకోవచ్చు. కాబట్టి హర్మన్ నుంచి పగ్గాలు అందుకున్న స్మృతిపై పెద్ద బాధ్యతే ఉంది. అయితే, ఇప్పటికే కెప్టెన్‌గా ఆమె నిరూపించుకుంది. డబ్ల్యూపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు ఆమె సారథిగా ఉన్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఆర్సీబీని రెండుసార్లు విజేతగా నిలిపింది. అలాగే, హర్మన్ గైర్హాజరీలో కూడా టీ20ల్లో 18 సార్లు భారత జట్టును నడిపించింది. అందులో 11 విజయాలు నమోదు చేయగా.. ఆరు మ్యాచ్‌ల్లో ఇండియా ఓడిపోయింది. సారథిగా అనుభవం ఉన్నప్పటికీ ఆమె కొన్ని సవాళ్లను ఎదుర్కోకతప్పదు. ప్లేయర్లను ఒక్కతాటిపై నడిపించడం, టీమ్‌ను మరింత బలోపేతం చేయడం, లోపాలను సరిదిద్దడం, అత్యున్నత స్థాయిలో జట్టు ప్రమాణాలను కొనసాగించడం వంటివి ఆమెకు సవాల్‌తో కూడుకున్నవే. ముఖ్యంగా ఐసీసీ టోర్నీల్లో జట్టు వైఫల్యాలకు చెక్ పెట్టడం ప్రధాన సవాల్. 2024, 2026 టీ20 వరల్డ్ కప్‌ల్లో టీమిండియా గ్రూపు దశలోనే నిష్క్రమించింది. వచ్చే ఏడాది జరగబోయే చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను విజేతగా నిలబడం ఆమె ముందు లక్ష్యం. ఆ టోర్నీకి ఇంకా మూడు నెలల సమయమే ఉంది. అలాగే, టీ20 ఫార్మాట్‌లో టీమిండియా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. ఈ విషయాన్ని ఇటీవల స్మృతినే ఒప్పుకుంది. టీ20ల్లో జట్టులో దూకుడు ఆటతీరును అలవర్చడం మంధానకు పరీక్షే.

భారత క్రికెట్‌లో వీవీఎస్ హవా!

సెలక్షన్ వ్యవహారాల్లో కీలకం

2027 వన్డే ప్రపంచకప్‌కు సమయం దగ్గరపడుతోంది. ఈ సమయంలో టీమిండియా ఎంపికల్లో మార్పులు చేయడం కంటే ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. సెలక్షన్ కమిటీ చైర్మన్ పదవికి అజిత్ అగార్కర్ పొడిగింపు కోరుకోకపోవడంతో కొత్త వ్యక్తి ఎంపికపై బోర్డు దృష్టి సారించింది. అయితే కొత్త చైర్మన్ వస్తే జట్టు ఎంపికపై ఆయన ఆలోచనలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రజ్ఞాన్ ఓజానే మరికొంతకాలం కొనసాగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు నేతృత్వం వహిస్తున్న వీవీఎస్ లక్ష్మణ్ ప్రభావం ఎంపికల వ్యవహారంలో పెరగవచ్చని 'బైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం పేర్కొంది. ఇదే జరిగితే ప్రస్తుత సెలక్షన్ విధానంలో పెద్దగా మార్పులు చేయకుండా ఓజాను తాత్కాలిక చైర్మన్‌గా కొనసాగించవచ్చని సమాచారం. ప్రపంచకప్‌కు ముందు కొత్త చైర్మన్ తనదైన ఆలోచనలతో ముందుకొస్తే జట్టు ప్రణాళికల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందన్నది బీసీసీఐ ఆందోళనగా తెలుస్తోంది.

బుమ్రా ఎప్పటికీ స్పెషల్: సంజూ

స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, ఆయన లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని సంజూశాంసన్ అంగీకరించాడు. ఆసియా క్రీడల తర్వాత వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శాంసన్ మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రా ఒక తరం గర్వించదగ్గ బౌలర్. అలాంటి ఆటగాడు జట్టులో ఉండటం మన అదృష్టం. ఆయనకు ప్రత్యామ్నాయం ఉండదు. కానీ, మన జట్టులోకి మంచి ప్రతిభ ఉన్న యువ ఆటగాళ్లు వస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. అలాగే గత కొన్ని మ్యాచ్‌లలో ప్రిన్స్ యాదవ్ కూడా ఆకట్టుకుంటున్నాడు. వారికి మనం ఎంత ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తే, వారు అంతగా రాటుదేలుతారు" అని వివరించాడు. బ్యాటింగ్ చేస్తూ గాయపడిన అర్ష్‌దీప్ గురించి మాట్లాడుతూ.. "అతను భుజానికి ఐస్ పెట్టుకుంటున్నాడు. త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నాను" అని తెలిపాడు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుత ఫామ్‌ను శాంసన్ ప్రశంసించాడు. "హోప్ చాలా బాగా ఆడుతున్నాడు.

క్వాలిఫయర్స్‌లో కువైట్, సౌదీ విజయం

2028లో జరగనున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి ఆసియా సబ్-రీజినల్ క్వాలిఫయర్స్ టోర్నీలు ముగిశాయి. మలేషియా వేదికగా జరిగిన ఈ టోర్నీల్లో కువైట్, సౌదీ అరేబియా తమ తమ గ్రూపుల్లో ఛాంపియన్లుగా నిలిచాయి. ఈ విజయంతో ప్రపంచకప్ రేసులో ఈ రెండు జట్లు మరో ముందడుగు వేసి ఆసియా రీజినల్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. సబ్-రీజినల్ క్వాలిఫయర్ 'ఎ' గ్రూప్‌లో కువైట్ అగ్రస్థానంలో నిలవగా, బహ్రెయిన్, ఖతార్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి రీజినల్ ఫైనల్స్‌కు అర్హత పొందాయి. ఇక క్వాలిఫయర్ 'బి' గ్రూప్‌లో సౌదీ అరేబియా విజేతగా నిలిచింది. ఈ గ్రూప్ నుంచి హాంగ్ కాంగ్, ఆతిథ్య మలేషియా కూడా తదుపరి దశకు చేరాయి. ఈ రెండు టోర్నీలలో కలిపి మొత్తం 13 జట్లు పాల్గొనగా, 36 మ్యాచ్‌లు జరిగాయి.

ఈవార్తలు
ప్రజావాణి
శుక్రవారం 16-10-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

ట్రేడ్ డీల్... భారత్‌కు ఎంత మేలు?

వాణిజ్య ఒప్పందం అంటే ఇరు దేశాలకూ లాభం చేకూర్చే పరస్పర అవగాహన. కానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని చూస్తుంటే ఈ సూత్రం ఎంతవరకు అమలవుతుందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం తొలి దశ దాదాపు ఖరారైందని, ప్రస్తుతం చట్టపరమైన ముసాయిదా ప్రక్రియ కొనసాగుతోందని భారత వాణిజ్య శాఖ చెబుతోంది. అదే సమయంలో భారత్ తన ఎగుమతిదారులకు పోటీ దేశాల కంటే మెరుగైన సుంక ప్రయోజనం, టారిఫ్ స్థిరత్వం కల్పించాలని పట్టుబడుతోంది. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమెరికా వాణిజ్య విధానంలో 'అమెరికా ప్రయోజనమే ప్రథమం' అన్న ధోరణి మరింత స్పష్టమైంది. సుంకాలను కేవలం వాణిజ్య సాధనంగా కాకుండా రాజకీయ, ఆర్థిక ఒత్తిడి సాధనంగా ఉ పయోగిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. భారత్‌పై గతంలో భారీ సుంకాల ముప్పు పెట్టి, ఆ తర్వాత చర్చల నేపథ్యంలో వాటిని తగ్గించడం ఇందుకు ఉదాహరణ. ఫిబ్రవరిలో కుదిరిన మధ్యంతర ఒప్పంద రూపురేఖల్లో భారత వస్తువులపై అమెరికా పరస్పర సుంకాన్ని 18 శాతానికి తగ్గించే అంశం ఉండగా, ప్రతిగా భారత్ అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు అంగీకరించింది. అంతేకాదు... అమెరికా మార్కెట్‌ను మరింతగా తెరవాల్సిందిగా భారత్‌పై ఒత్తిడి పెరుగుతోంది. వైద్య పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తులు, ఐసీటీ ఉత్పత్తులు తదితర రంగాల్లో అమెరికా వస్తువులకు మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు భారత్ కొన్ని అడ్డంకులను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అదే సమయంలో భారత్ ఐదేళ్లలో అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, విమానాలు, సాంకేతిక ఉత్పత్తులు తదితరాలను కొనుగోలు చేయాలన్న ఉద్దేశాన్ని కూడా ప్రకటించింది. అయితే ప్రశ్న ఒక్కటే.. ఇంతకీ భారత్‌కు దక్కేది ఏమిటి? అమెరికా మార్కెట్‌లో భారత వస్తువులకు సుంక భారం తగ్గితే ఎగుమతిదారులకు ప్రయోజనం కలుగుతుంది. ముఖ్యంగా వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, రసాయనాలు, ఔషధాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు వంటి రంగాలకు అమెరికా మార్కెట్ కీలకం. భారత ఎగుమతులు ఇప్పటికే పెరుగుతున్నాయి. ఏప్రిల్–ఆగస్టు మధ్య అమెరికాకు భారత వస్తువుల ఎగుమతులు గత ఏడాది ఇదే కాలంలోని 40.39 బిలియన్ డాలర్ల నుంచి 42.79 బిలియన్ డాలర్లకు పెరిగాయి. కానీ ఈ ప్రయోజనం శాశ్వతమా? అన్నదే అసలు సందేహం.

ఆకలి కేకలు ముంచుకొస్తోంది..!

పొలంలో పంట పండితేనే ఇంట్లో పొయ్యి వెలుగుతుంది. వానలు కురిస్తేనే రైతు ముఖంలో చిరునవ్వు కనిపిస్తుంది. పంటలు చేతికొస్తేనే పేదవాడి కంచంలో నాలుగు మెతుకులు పడతాయి. కానీ ప్రకృతి ప్రకోపిస్తే? రుతుపవనాలు ముఖం చాటేస్తే? ఎండలు భూమిని దహించివేస్తే? పంటలు ఎండిపోయి, చెరువులు అడుగంటితే? అప్పుడు ఎదురయ్యేది కేవలం వ్యవసాయ సంక్షోభం కాదు.. కోట్లాది మంది కడుపులను కాల్చే ఆకలి సంక్షోభం! ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా మన ముందున్న అత్యంత ఆందోళనకరమైన ప్రశ్న ఇదే. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వ్యవసాయాన్ని దెబ్బతీసి ఆహార కొరతకు దారితీస్తే ప్రభుత్వాలు ఏం చేస్తాయి? ముందస్తు చర్యలు తీసుకుంటాయా? లేక సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత నష్ట నివారణ చర్యల పేరుతో హడావుడి చేస్తాయా? ప్రతి ఏడాది అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

ఆహార భద్రత, పోషకాహారం, ఆకలి నిర్మూలన గురించి చర్చిస్తున్నాం. సభలు, సమావేశాలు, నినాదాలతో బాధ్యత తీరిపోయిందనుకుంటే పొరపాటే. ప్రపంచంలో ఒకవైపు ఆహారం వృథా అవుతుంటే, మరోవైపు కోట్లాది మంది కనీస ఆహారానికి నోచుకోవడం లేదు. పేదరికం, నిరుద్యోగం, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు, ధరల పెరుగుదల.. ఇలా ఎన్నో కారణాలు ప్రజలను ఆకలి కోరల్లోకి నెడుతున్నాయి. వీటికి వాతావరణ సంక్షోభం తోడైతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కే ఎల్‌నినో పరిస్థితులు ప్రపంచ వాతావరణంపై ప్రభావం చూపగలవు. భారతదేశంలో రుతుపవనాల వర్షపాతంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే ప్రతి ఎల్‌నినో ఏడాది కచ్చితంగా కరువునే తెస్తుందని చెప్పలేం. దాని ప్రభావం తీవ్రత, ఇతర వాతావరణ పరిస్థితులు, ప్రాంతాలవారీగా మారుతుంది. కానీ ఇప్పటికే పెరుగుతున్న ఉ ష్ణోగ్రతలు, అస్థిర వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదలతో సతమతమవుతున్న వ్యవసాయానికి ఎల్‌నినో మరో సవాలుగా మారవచ్చు. వర్షాలు సకాలంలో పడకపోతే విత్తనాలు మొలకెత్తవు. పంట ఎదుగుదల దశలో నీరు అందకపోతే దిగుబడులు తగ్గుతాయి. పంట చేతికొచ్చే సమయంలో తీవ్రమైన వేడి ఎదురైతే రైతు పెట్టుబడి బూడిదవుతుంది. వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటల ఉత్పత్తి దెబ్బతింటే దాని ప్రభావం ఒక్క రైతుకే పరిమితం కాదు. ఆహార సరఫరా తగ్గుతుంది. ధరలు పెరిగే ప్రమాదం ఏర్పడుతుంది. రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలు, చిన్న ఉద్యోగులు, పట్టణ పేదలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి తలెత్తుతుంది. వ్యవసాయ సంక్షోభం వచ్చినప్పుడు మొదట నష్టపోయేది రైతు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల కోసం అప్పులు చేసి పంట సాగు చేస్తాడు. చివరకు వానలు లేక పంట ఎండిపోతే చేతిలో మిగిలేది అప్పులే. దిగుబడి తగ్గితే ఆదాయం పడిపోతుంది. అప్పులు తీర్చలేక ఆర్థిక ఒత్తిడిలో కూరుకుపోతాడు. అదే సమయంలో మార్కెట్లో ఆహారధాన్యాల లభ్యత తగ్గితే వినియోగదారుడి జేబుకు చిల్లు పడుతుంది. ఒకవైపు రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోవడం, మరోవైపు ప్రజలకు అధిక ధరలకు కూడా నాణ్యమైన ఆహారం అందుబాటులో లేకపోవడం.. ఈ వైరుధ్యం మన వ్యవసాయ, ఆహార పంపిణీ వ్యవస్థలోని బలహీనతలను బయటపెడుతుంది.

ఆహార కొరత అంటే మార్కెట్లో బియ్యం, గోధుమలు కనిపించకపోవడమే కాదు. కొనుగోలు శక్తి తగ్గి ప్రజలు పోషకాహారానికి దూరమవడం కూడా ఆహార భద్రతకు ముప్పే. ధరలు పెరిగితే పేద కుటుంబాలు ముందుగా పాలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాల వినియోగాన్ని తగ్గిస్తాయి. దాంతో పోషకాహార లోపం పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలు పడవచ్చు. కడుపు నింపుకోవడానికి సరిపడా ఆహారం దొరకని పరిస్థితి ఏర్పడితే అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక వృద్ధి గురించి చేసే చర్చలన్నీ అర్థరహితంగా మారిపోతాయి. సంక్షోభం వచ్చిన తర్వాత సమీక్షా సమావేశాలు నిర్వహించడం, నష్టపరిహారం ప్రకటించడం, రేషన్ పంపిణీని హడావుడిగా పెంచడం మాత్రమే సరిపోదు. ఆకలి సంక్షోభం ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే నిజమైన పాలనకు పరీక్ష. వాతావరణ అంచనాలను నిరంతరం పరిశీలిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ శాఖలు, వాతావరణ విభాగాలు, నీటిపారుదల సంస్థలు, ఆహార సరఫరా విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచాలి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై సూచనలు ఇవ్వాలి. తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించాలి. విత్తనాలు, పంటల బీమా, సాగు సలహాలు సమయానికి అందించాలి. చెరువులు, కుంటలు, జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని శాస్త్రీయంగా వినియోగించాలి. భూగర్భ జలాలపై ఒత్తిడిని తగ్గించేందుకు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. సాగునీరు, తాగునీటి అవసరాల మధ్య సమతుల్యత పాటించాలి. వర్షాభావం తీవ్రతరమైతే రైతులకు తక్షణ సహాయం అందించేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. ఇదే సమయంలో దేశంలో అందుబాటులో ఉన్న ఆహారధాన్యాల నిల్వలను సమీక్షించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరిపడా ధాన్యం అందేలా చూడాలి. ధరల పెరుగుదలపై నిఘా పెట్టాలి. కృత్రిమ కొరత సృష్టించే నిల్వదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. పోషకాహార పథకాలకు ఆటంకం కలగకుండా చూడాలి. ఉపాధి అవకాశాలు తగ్గే కరువు ప్రాంతాల్లో గ్రామీణ ఉపాధి కార్యక్రమాలను బలోపేతం చేయాలి. రైతు ఆదాయం పడిపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా కుంగిపోతుందనే విషయాన్ని ప్రభుత్వాలు విస్మరించకూడదు.ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో ముందుగానే ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాకపోవచ్చు. కానీ సంభవించే ప్రమాదాన్ని అంచనా వేసి సిద్ధపడటం మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. వాతావరణ మార్పుల వల్ల కరువు, అధిక వేడి, అతివృష్టి వంటి పరిస్థితులు తరచుగా ఎదురైతే వ్యవసాయాన్ని పాత పద్ధతులతోనే నడపడం సాధ్యం కాదు. నీటి పొదుపు, వాతావరణాన్ని తట్టుకునే పంగడాలు, పంటల వైవిధ్యం, నిల్వ సదుపాయాలు, సమర్థవంతమైన ఆహార పంపిణీ వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాలి. రైతుకు నష్టం వచ్చినప్పుడు పరిహారం అందించడమే కాకుండా, నష్టం జరగకుండా కాపాడే వ్యవస్థను నిర్మించాలి. ఆహార భద్రతను కేవలం వ్యవసాయ శాఖకు సంబంధించిన అంశంగా చూడటం కూడా పొరపాటే. ఇది ఆర్థిక, ఆరోగ్య, విద్య, ఉపాధి, సామాజిక సంక్షేమ రంగాలతో ముడిపడిన జాతీయ బాధ్యత. రైతు పొలంలో పంట పండించడం ఒక దశ అయితే, ఆ పంటను నిల్వ చేసి, సరసమైన ధరకు ప్రజలకు అందించడం మరో కీలక దశ. ఈ రెండింటి మధ్య ఎక్కడ లోపం ఏర్పడినా దాని మూల్యం సామాన్య ప్రజలే చెల్లించాల్సి వస్తుంది. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు తమను తాము ప్రశ్నించుకోవాలి. రేపు వర్షాలు తగ్గితే మన ప్రణాళిక ఏమిటి? పంట దిగుబడులు పడిపోతే ఆహార నిల్వలు సరిపోతాయా? నిత్యావసరాల ధరలు పెరిగితే పేద కుటుంబాలను ఎలా ఆదుకుంటాం? రైతు పంట ఎండిపోతే అతని కుటుంబానికి అండగా నిలిచే వ్యవస్థ సిద్ధంగా ఉందా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోతే ఆహార భద్రతపై చేసే ప్రకటనలకు విలువ ఉండదు.

ప్రకృతి ఎప్పుడు ఎలాంటి పరీక్ష పెడుతుందో మన చేతుల్లో లేదు. కానీ ఆ పరీక్షకు సిద్ధపడాలా, చేతులెత్తేయాలా అన్నది మాత్రం మన నిర్ణయమే. ఎల్‌నినో ప్రభావం తీవ్రమై వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయం, ఆహార సరఫరా, ప్రజల జీవనోపాధిపై ఒత్తిడి పెరగవచ్చు. అలాంటి పరిస్థితి ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. ప్రభుత్వాలు ఇప్పుడే మేల్కొనాలి. రైతును కాపాడాలి. ఆహార నిల్వలను బలోపేతం చేయాలి. ధరలను అదుపులో ఉంచాలి. పేదవాడి కంచంలో అన్నం తగ్గకుండా చూడాలి. లేదంటే నేడు నిర్లక్ష్యం చేసిన చిన్న హెచ్చరికే రేపు పెద్ద ఆహార సంక్షోభంగా మారవచ్చు. అప్పుడు ఆకలి బాధితుల ముందు హామీలు పనిచేయవు.. ప్రకటనలు కడుపు నింపవు.. సమావేశాలు అన్నం పెట్టవు. కావాల్సింది ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన అమలు, ప్రజల పట్ల బాధ్యత.



నవీన్ పోగుల

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.